


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 14.10.2025 | సంపుటి : 2 | సంచిక :250 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thuesday | 14.10.2025 | volume : 2 | Issue : 250 | Pages : 8 | Cost : 2/- |





04

### కరూర్‌లో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు : సుప్రీంకోర్టు



04

### పసిడి ధగధగలు

రూ.1.30లక్షల దిశగా పరుగులు

# సంక్షేమహాస్టళ్లకు సత్వర చికిత్స

## హాస్టల్ వ్యవస్థలో అకౌంటబిలిటీ రావాలి



విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఫేస్ రికగ్నేషన్

టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు అందించే భోజనంపై క్వాలిటీ చెక్

సంక్షేమహాస్టళ్ల పనితీరుపై అధికారులతో సీఎం రేవంత్  ఉన్నతస్థాయి సమీక్ష




రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పూర్తిస్థాయి డేటాతో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థలో అకౌంటబిలిటీ ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పూర్తిగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ పరిధిలోకి తీసుకు రావాలన్నారు.

హైదరాబాద్,అక్టోబర్13 : సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు లు షబ్బీర్

-మిగతా 2 లో..



## యుద్ధాలను ఆపడంలో నేను నిపుణుడిని

### పాక్-అఫ్గాన్ యుద్ధం సంగతి చూస్తా

టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో 24 గంటల్లో భారత్-పాక్ యుద్ధం ఆగిపోయింది

రష్యా రాజీకి రాకపోతే తోమహాక్ రంగంలోకి ..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

న్యూయార్క్: ప్రపంచంలో ఏమూల సైనిక ఘర్షణ జరిగినా ట్రంప్ అప్రమత్తమైపోతున్నారు. ఏడు యుద్ధాలను ఆపినట్లు వెల్లడించిన ఆయన తాజాగా ఎనిమిదో యుద్ధం ఆపబోతున్నట్లు వెల్లడించారు. గాజా ఒప్పందం కోసం పశ్చిమాసియాకు పయనమైన వేళ ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "నేను ఆపిన ఎనిమిదో యుద్ధం (గాజాలో) అవుతుంది. పాకిస్థాన్-అఫ్గానిస్థాన్‌ల మధ్య కూడా యుద్ధం జరుగుతోందని విన్నాను. నేను తిరిగి వచ్చేవరకు ఆగుతాను.  నేను యుద్ధాలను ఆపడంలో నిపుణుడిని" అని ట్రంప్ పేర్కొన్నారు. టారిఫ్‌ల ను ఆయుధంగా వాడి తాను సంక్షోభాలను పరిష్కరించానని పునరుద్ఘాటించారు. దీనికి భారత్-పాక్ సైనిక ఘర్షణను ఆయన ఉదాహరణగా చూపారు. ఇరుదేశాలపై 100 నుంచి 150, 200శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో 24 గంటల్లో యుద్ధం ఆగిపోయిందన్నారు.

-మిగతా 10 లో..

# ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

వారికి చెక్ పెట్టాలంటే బిఆర్ఎస్ గెలవాలి

కారుబుల్డోజర్ ఫైట్‌లో మనదే గెలుపు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

బుల్డోజర్ పాలనను అడ్డుకోవడానికి కారుకు ఓటేయాలని కెటిఆర్ ఆన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని కేటీఆర్ అన్నారు.



హైదరాబాద్,అక్టోబర్13 : ఈ నెల రోజులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు చెప్పాలని.. కారు, బుల్డోజర్ మధ్య యుద్ధం జరుగుతుందని, రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందని ఆయన అన్నారు.  అలాగే అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని రేవంత్ రెడ్డి ఒక కాగితం ఇచ్చాడు. కానీ, కోర్టు కేసులో ఉన్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రావడం అసాధ్యం అన్న విషయం రేవంత్‌కే తెలుసునని ఎద్దేవా చేశారు. ఇది కేవలం ఓట్ల కోసమే చేస్తున్న రాజకీయ

-మిగతా 2 లో..



## బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరును ప్రజలు గుర్తించారు

జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ

బిజెపికే గెలుపు అవకాశాల ఉన్నాయి

నేడు అభ్యర్థిని ప్రకటిస్తామన్న రామచంద్రరావు

హైదరాబాద్,అక్టోబర్13: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఇందుకు సంబంధించి ప్రధాన పార్టీలు వారి అభ్యర్థుల ఖరారుపై సన్నాహాలు మరింత దూకుడును పెంచాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. అనేక మంది విద్యావంతులు, మేధావులు బీజేపీలో చేరుతున్నారని.. మంగళవారం నాటికి జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు .అక్కడ కాంగ్రెస్ పోటీ చేస్తుందా, లేక మజ్లిస్ పోటీ చేస్తుందా అనేది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ప్రస్తుతం మజ్లిస్ అభ్యర్థి కాంగ్రెస్

-మిగతా 2 లో..

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

21 వరకు నామినేషన్ల స్వీకరణ.. 22న నామినేషన్ల పరిశీలన

24న నామినేషన్ల ఉపసంహరణ గడువు



హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల పక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది.

హైదరాబాద్,అక్టోబర్13 : అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం

-మిగతా 2 లో..

## ఆరుగురు బాలురపై లైంగిక దాడి

### పోలీసుల అదుపులో నిందితుడు

హైదరాబాద్: సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ వీధి బాలుర గృహంలో ఆరుగురు బాలురపై పర్యవేక్షకుడు రెహమాన్ లైంగిక దాడి చేశాడు. బాధితుల్లోని ఓ బాలుడి తల్లి సైదాబాద్ పోలీసులను ఆశ్రయించగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దసరా పండగకి ఇంటికి వచ్చి తిరిగి జువైనైల్ హోంకు

-మిగతా 2 లో..

## అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

### ఏపని చేయాలన్నా పర్సెంటేజీలు వసూళ్లు

కాంగ్రెస్ రాకతో అభివృద్ధి వెనక్కి

ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ సురుకు తగలాలి

పార్టీ కార్యకర్తల భేటీలో హరీష్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి.

02



## మేడారం అభివృద్ధికి ₹212కోట్లు

70 కోట్ల కాంట్రాక్ట్ కోసం కక్కుర్తి పడే మనిషిని కాదు

మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్య

ములుగు,అక్టోబర్13: మేడారం అభివృద్ధికి రూ.212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని సూచించారు. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటాం. కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ.101 కోట్లు కేటాయించామన్నారు.  ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం అని తెలిపారు. మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ

-మిగతా 2 లో..

### గడువు లోగా పనులు పూర్తి చేయాల్సిందే

మంత్రి సీతక్కతో కలసి మేడారం పనులపై సమీక్ష



# సంక్షేమ హాస్టళ్లకు సత్వర చికిత్స

మొదటి పేజీ తరువాయి

అలీ, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ విభాగాల పనితీరు, పథకాల అమలుపై ఈ సమావేశంలో చర్చించారు. విద్యార్థులకు అందించే భోజనం క్వాలిటీ చెక్‌కు టెక్నాలజీని ఉపయోగించు కోవాల ని.. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే దుస్తులు, పుస్తకాలు వారికి చేరుతున్నాయో లేదో ధ్రువీకరించాలని తెలిపారు. మౌలిక వసతులకు సంబంధించి ప్రతీ హాస్టల్‌లో పరిస్థితు లపై పూర్తిస్థాయి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని.. ఇందుకు అవసరమైన టెక్నాల జీని ఉపయోగించుకోవాలని సూచనలు చేశారు సీఎం. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక విధానం అనుసరించాల న్నారు. ఇందుకు సంబంధించి ఏరియలవారీగా హాస్టళ్లను సమీపంలో ఉన్న మెడికల్ కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌తో లింక్ చేయాలని ఆదేశించారు. తరచూ హాస్టళ్లను సందర్శించి హెల్త్ చెకప్స్ చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో



సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి.. ప్రతీ నెలా గ్రీన్ ఛానల్‌లో నిధులు అందించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొం దించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పూర్తి డేటాతో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థలో జవాబుదారీ తనం కనిపిం చాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవా లన్నారు. ప్రతి హాస్టల్‌లో మౌలిక సదుపాయాలపై పూర్తి స్థాయి డేటా ను సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక విధానం అను సరించాల ని, హాస్టళ్లను సమీపంలోని వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెం టర్లకు అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి ఆరోగ్య తనిఖీలు చేయాలని దిశానిర్దేశం చేశారు.



## జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ

మొదటి పేజీ తరువాయి

గుర్తుపై పోటీ చేస్తున్నాడు. హస్తం గుర్తుతోనే పతంగిని ఎగరేస్తున్నారు. ఇది జూబ్లీహిల్స్ ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. ఇకపోతే, జూబ్లీహిల్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని.. అక్కడ ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేదన్నారు. ఇంకా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. అవన్నీ 420 కేసులే అన్నారు. బీజేపీనే గెలిపించాలని ప్రజలను కోరుతున్నామని ఆయన అన్నారు. నిజమైన ప్రతిపక్షంగా మేమే కాంగ్రెస్‌ను నిలదీస్తాం అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, బిఆర్ఎస్ పార్టీలో గెలిచినవాళ్లు ఆ పార్టీలో ఉంటారో లేదో తెలియదన్నారు. చివరికి వాళ్లు పార్టీ మారక తప్పదని.. పార్లమెంట్ ఎన్నికలలో మరో పార్టీ నుండి బి ఫార్మ్ తీసుకుని పోటీ చేసే పరిస్థితి వస్తుందని అన్నారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలుస్తుందనే నమ్మకం మాకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తోందా?మజ్లిస్ పోటీ చేస్తోందా? అని భాజపా ప్రశ్నించారు. కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వనగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది. జూబ్లీహిల్స్ ప్రజలు భాజపాను ఆదరించాలి. నియోజకవర్గంలోని మేధావులు, సినీ ప్రముఖులు మా పార్టీకి ఓటు వేస్తారని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.



## అద్భుతంగా మేడారం అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు మంత్రి. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాతి కట్టడాలకు కావల్సిన గ్రానైట్ పొరుగు రాష్ట్రాల నుండి తెప్పిస్తున్నట్లు చెప్పారు. శాశ్వత ప్రతిపాదకన పనులు చేస్తున్నామని అన్నారు.ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గత జాతరకు కోటిమంది భక్తులు హాజరయ్యారని.. ఈసారి భక్తుల సంఖ్య డబుల్ అవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారని పొంగులేటి అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనపై మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారని అనుకోవటం లేదని అన్నారు. తనపై ఫిర్యాదు చేయటానికి ఏముంటుందని అన్నారు. రూ.70 కోట్ల కాంట్రాక్ట్ కోసం తాపత్రయ పడే అంత అవసరం తనకు లేదన్నారు. అయితే తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

## లాలూ కుటుంబానికి ఢిల్లీ కోర్టు షాక్

### రైల్వే కాంట్రాక్ట్ కేసులో అభియోగాలు నమోదు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల తరుణంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి అనూహ్య షాక్ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై సోమవారం దిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. వచ్చే నెల బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ సమయంలో అవినీతి కేసులో కోర్టు ఆదేశాలు లాలూ కుటుంబానికి షాక్ అనే చెప్పొచ్చు. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది. బిహార్‌లో అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పు చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా.. అసలు ఇది తప్పుడు కేసు అని రబ్రీ దేవీ పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనేది ఆరోపణ. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూ యాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సీబీఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టుకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు.

## అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ



**హైదరాబాద్, అక్టోబర్ 13 :** మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని.. 700 రోజులు దాటినా వాటిని అమలు చేయడం లేదని.. అందుకే అందుకే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక అని..యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగుతుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. లేకుంటే ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వేశారని రేవంత్ అంటాడని చెప్పారు. ఉద్యోగాలు రావాలన్నా.. పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బీఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునీతా గెలవాలన్నారు. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిందని.. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిందని మండిపడ్డారు. బిల్డింగ్ పర్మిషన్‌కు స్క్వేర్ ఫీట్‌కు రూ.75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట అంటూ ఆరోపించారు. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40 శాతం భూములు రాసివ్వాలట.. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిందని ధ్వజమెత్తారు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామమని.. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేదని.. తెలంగాణ అనుసరిస్తే, దేశం ఆచరించేదన్నారు. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని.. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని.. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభిస్తే రేవంత్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని.. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవన్నారు. వాళ్లకు జీతాలు ఇవ్వకుండా మీకు వైద్య సేవలు అందకుండా రేవంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. బస్తీ దవాఖానలు చూస్తే కేసీఆర్ గుర్తుకు వస్తారు, కాబట్టి బస్తీ దవాఖానల ఉనికి లేకుండా చేస్తున్నడని.. నీళ్ల బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని.. రేవంతు వచ్చిండు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాగంటి సునీతమ్మ గెలుపు మాత్రమే కాదని.. తెలంగాణ ప్రజల గెలుపు అని తెలిపారు. హైడ్రా పెట్టి పెద్దోళ్ల ఇండ్లు కూల్చుతలేదు గానీ, పేదోళ్ల ఇండ్లు కూల్చుతున్నడని.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి చీఫ్ విప్, గాంధీల ఇండ్లు, భూములు హైడ్రాకు ఎందుకు కనబడటం లేదని.. గరీబోళ్ల ఇండ్లే హైడ్రాకు కనబడుతున్నాయా? అంటూ నిలదీశారు. 'హైడ్రా కతం హోనాహే.. కాంగ్రెస్ కో హరానేహే.. హైడ్రా బంద్ హోనాతో .. మాగంటి సునితమ్మకో జితానాహే' అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్ వస్తది.. అది రావొద్దు అంటే సునితమ్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ డిప్యూటీ సీఎం, హోం మినిస్టర్ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, మహమూద్ అలీ ఇద్దరే మొదట మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. షాదీ ముబారక్ కింద తులం బంగారం అన్నాడని.. తులం జాడ లేదు గానీ కల్యాణ లక్ష్మి చెక్కు ఏడాది దాటినా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్ బందు, బతుకమ్మ చీర బందు, రంజాన్ తోఫా బంద్, ఓవర్సీస్ స్కాలర్ షిప్ బందు, దళిత బందు బందు, బీసీ బందు బందు, బస్తీ దవాఖాన ఖతం పట్టించారని ఆరోపించారు. హిందు, ముస్లిం అందరం కలిసి హైద్రాబాద్‌ను, తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ఇది మాగంటి సునితమ్మ గెలుపు కాదని.. బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపు, తెలంగాణ గెలుపుగా అందరం కలిసి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

జూబ్లీహిల్స్ కార్యకర్తలు బాగా కలిసి పనిచేస్తున్నా రని.. కేటీఆర్, తాను జూబ్లీహిల్స్‌ను ఆనుకొని ఉన్నామన్నారు.సునితమ్మకు కుడి, ఎడమ చెయ్యిగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలకు ఆపద వస్తే, మెసేజ్ చేస్తే చాలు నేను, తలసాని, కేటీఆర్ ముందుంటామని స్పష్టం చేశారు. ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని.. భయ పడాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ జూబ్లీహిల్స్ గెలిపించి బహుమ తిగా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్‌ను దించి.. మనం కూడా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. తమ్ముడు విష్ణువర్ధన్ రెడ్డి సునితమ్మకు తమ్ముడిగా ఎంతో కృషి చేస్తున్నారని.. ఎక్కడ చూసినా కేసీఆర్ కు ఓటు వేస్తాం అని అంటున్నారని.. పెద్ద మెజారిటీతో సునీతమ్మను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు.

## ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

- వారికి చెక్ పెట్టాలంటే బిఆర్ఎస్ గెలవాలి
- కారు-బుల్డోజర్ ఫైట్‌లో మనదే గెలుపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 13 :** బుల్డోజర్ పాలనను అడ్డుకోవడానికి కారుకు ఓటేయాలని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మన గెలుపు ఖాయం, మెజార్టీ తెచ్చుకోవడమే మన చేతుల్లో ఉందని తాజాగా జరిగిన సభలో ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల రోజులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు చెప్పాలని.. కారు, బుల్డోజర్ మధ్య యుద్ధం జరుగుతుందని, రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందని ఆయన అన్నారు. అలాగే అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని రేవంత్ రెడ్డి ఒక కాగితం ఇచ్చాడు. కానీ, కోర్టు కేసులో ఉన్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రావడం అసాధ్యం అన్న విషయం రేవంత్‌కే తెలుసునని ఎద్దేవా చేశారు. ఇది కేవలం ఓట్ల కోసమే చేస్తున్న రాజకీయ నాటకమని, గెలవలేక పక్క దారులు పడుతున్నారని ఆయంబ విమర్శలు గుప్పించారు. ఒక్క ఇంట్లోనే 40 దొంగ ఓట్లు రాయించుకున్నారని విమర్శించారు. గత ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంపై ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆ కుటుంబం అనాథ కాదు. ఆ కుటుంబానికి మేమందరం అండగా ఉన్నాం. ఈరోజు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరం జూబ్లీహిల్స్‌లో వారికి బలం ఇవ్వడానికి వచ్చాం అని అన్నారు. ఇక జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని.. ప్రజలు మన దిక్కు ఉన్నారని, నిజం మన దిక్కు ఉంది, ధర్మం మన దిక్కు ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసం చేసినందుకు ప్రజలు స్వయంగా సమాధానం చెబుతారని.. మోసపోయిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఈసారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల రోజులు ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి నిజం చెప్పాలని.. జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరడం మనందరి లక్ష్యం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పెద్దలు ముసలమ్మలకు, ముసలయ్యలకు నెలకు రూ.4000 ఇస్తామని చెప్పారు. ఇప్పుడు 24 నెలలు గడిచాయి.. ఒక్క పైసా ఇచ్చారా? బాకీ మొత్తం రూ.48,000 అయ్యింది. అలాగే 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పిన హామీ కూడా నెరవేర్చలేదు. నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం అన్నీ మాటలకే పరిమితం అయ్యాయని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాకీల లెక్కను ప్రజల ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి ముసలమ్మకు రూ.48,000, ప్రతి మహిళకు రూ.50,000 బాకీ ఉన్నదని బాకీ కార్డుతో చెప్పాలి. ఈ సారి కాంగ్రెస్ మోసానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు.

## జూబ్లీహిల్స్‌లో 200 నామినేషన్లు వేస్తున్నాం

### తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం జిల్లాల వారీగా 200 మంది మాలలు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఆరు నెలలుగా జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షుడు చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 'ఎంపెరికల్ డేటా తీసుకుని, అన్ని వర్గాలతో చర్చించి వర్గీకరణ చేస్తామన్నారు. అవేవీ చేయకుండానే వర్గీకరణ చేసి 58 కులాల గొంతు కోశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం అని జేఏసీ నేతలు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

ప్రకటిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

## ఆరుగురు బాలురపై లైంగిక దాడి..

మొదటి పేజీ తరువాయి

వెళ్లనని ఓ చిన్నారి తల్లి వద్ద భోరున విలపించాడు. ఆరా తీయడంతో.. విషయం తెలిసింది. జువెనైల్ హోంలో సంరక్షకుడే అభంశుభం తెలియని బాలురపై అసహజరీతిలో తరచూ లైంగికదాడికి పాల్పడ్డాడు. మొదట బాధితుడు ఒక్కడే అనుకున్నారు.. పోలీసులు కూపీ లాగితే మరో అయిదుగురి పైనా లైంగిక దాడి చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు వైద్యుల పరీక్షల్లో బాలుడిపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధరణ అయింది. మిగిలిన ఐదుగురు మైనర్లకు కూడా పోలీసులు వైద్య పరీక్షలు చేయించనున్నారు. ప్రస్తుతం నిందితుడు రెహమాన్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు

- ఓటర్లను భయపెడుతున్న అధికార కాంగ్రెస్
- ఎన్నికల సంఘానికి కేటీఆర్ ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారని, ఓటర్లను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి సోమవారం బీఆర్కే భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాలని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నేతలు పెద్ద కుట్రకు తెరలేపారని ఆక్షేపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అవుతోందని అంటుంటే, జూబ్లీహిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ నేతలే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లని సృష్టించారని ఫైర్ అయ్యారు. ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశానని తెలిపారు. కొవ్వూరి కార్తీక్ పేరుతో మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని.. దీపక్ శర్మ అనే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. కింది స్థాయి అధికారులు కాంగ్రెస్‌తో కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించారని మండిపడ్డారు. దొంగ ఓట్ల పైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కైన కింది స్థాయి అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలోపు 20 వేల దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక జరగాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

## కొత్త మద్యం పాలసీపై పిటిషన్

### విచారణ 2వారాలకు వాయిదా

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# జైళ్లశాఖ పనితీరు అద్భుతం

- ఖైదీలకు బీమా.. కుటుంబ సభ్యులకు రుణాలు
- ఖైదీల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లల్లో చదువులు
- చర్లపల్లి జైలును సందర్శించిన కేంద్రమంత్రి
- డిజి సౌమ్యా మిశ్రాను అభినదించిన మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ సభ్యులకు వడ్డీలేకుండా రుణ సదుపాయం కల్పించడం అభిందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా ఉండలేమన్నారు. కస్టడీ-కేర్-కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్నఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూలవనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు. అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజి విజన్ అద్బుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో 'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ. 11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతో పాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొ÷ల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు.




## శాంతి ఒప్పందంలో బందీల విడుదల

**స్వాగతించిన ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాది ంచిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా సజీవంగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీల ను హమాస్ విడు దల చేయడాన్ని ప్రధాని మోదీ స్వాగ తించారు. పశ్చి మాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయ త్నాలకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నా రు. రెండేళ్లకు పైగా హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను స్వాగతి స్తున్నాం. బందీల స్వేచ్ఛ.. సంబం ధిత కుటుంబాల ధైర్యానికి, అమెరికా అధ్య క్షుడు ట్రంప్ స్థిరమైన శాంతి ప్రయ త్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దృఢ సంకల్పానికి గుర్తింపుగా నిలుస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నాం' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్‌లు ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలోనే నేడు 20 మంది సజీవ బందీలను హమాస్ అప్పగించింది. 28 మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను కూడా త్వరలోనే అప్పగించనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

## మంథనిలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు

- రూ.45 కోట్లతో ఏటీసీ కేంద్రం,సామాజిక భవన నిర్మాణం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**పెద్దపల్లి, అక్టోబర్ 13 :** రాబోయే విద్యా సంవత్సరం నుంచి మంథనిలో ఏటీసీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంథని ప్రాంతాన్ని సరస్వతి నిలయంగా అభివృద్ధి చేస్తానని శ్రీధర్ బాబు అన్నారు. మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంథనిలో రూ.45 కోట్ల వ్యయంతో నూతన ఏటీసీ కేంద్రం, సామాజిక భవనాల నిర్మాణాలకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించే దిశగా కేంద్రాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా ఆధునీకీకరణ చేశామన్నారు. ఏటీసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అభిస్తాయని, ఇటీవలే కాటారంలో రూ.35 కోట్లతో ఏటీసీని ప్రారంభించమన్నారు. రామగిరి, కమాన్పూర్, ముత్తారం, మంథని మండలాలకు చెందిన 87 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 38 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ ఛైర్మన్ వెంకన్న, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుల ఎన్నికలో కొత్త ఒరవడి

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**



**దిల్లీ:** డీసీసీ అధ్యక్ష ఎన్నికల్లో కొత్త ఒరవడికి ఏఐసీసీ శ్రీకారం చుట్టిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సమర్థ నాయకత్వానికే పట్టం కడతారని చెప్పారు. ఇకపై డీసీసీ అధ్యక్షులు ప్రత్యేక పాత్ర పోషిస్తారన్న ఆయన.. సీఈసీ సమావేశానికి డీసీసీ అధ్యక్షులను కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తారన్నారు. అన్ని జిల్లాల్లో డీసీసీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సజావుగా జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీలకు పాత్ర ఉంటుందని తెలిపారు. డీసీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం నుంచి ఏఐసీసీ పరిశీలకులు జిల్లాల్లో పర్యటిస్తున్నారన్నారు.

## లంచం తీసుకుంటే చూస్తూ ఊరుకోం

- సివిల్ తగాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డిజిపి హెచ్చరిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** పోలీసులు లంచగొండులుగా మారినా, సివిల్ తగాదాల్లో తలదూర్చిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరిచారు. పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు. యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉండవని తేల్చిచెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసు ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పుకొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు డీజీపీ శివధర్ రెడ్డి. కేసుల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో ఆదుకున్న వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.



## బెంగాల్ తరహాలో జార్ఖండ్‌లో ఘటన

- రాంచిలో 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్
- ఐదుగురు దుండగులను అరెస్ట్ చేసిన పోలీసులు

**రాంచి, అక్టోబర్ 13 :** అమ్మాయిలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఆడవారిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. బెంగాల్ మెడికోపై అత్యాచార ఘటన మరవక ముందే జార్ఖండ్‌లో ఓ ఘటన కలచివేసింది. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కామాంధుల్లో మార్పు రావడం లేదు. పశ్చిమ బెంగాల్ లో ఓ వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది. ఈ ఘటన మరువక ముందే తాజాగా జార్ఖండ్‌లో అదే తరహా ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ రాజధాని రాంచీలోని రతు ప్రాంతంలో 14 ఏళ్ల బాలిక తన కుటుంబంతో నివాసం ఉంటుంది. అయితే ఆదివారం ఆ బాలికపై కామాంధులు కాటేశారు. రాత్రి సమయంలో 9 మంది వ్యక్తులు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించామని పోలీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్ పుష్కర్ తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. అలానే నిందితులపై పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని రతు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అధికారి రాం నారాయణ్ సింగ్ తెలిపారు.

## న్యాయ వ్యవహారాల్లోనూ సాంకేతికత

- అందిపుచ్చుకుని ముందుకు సాగాలి
- లాఫెస్ట్ కార్యక్రమం ప్రారంభించిన మంత్రి వివేక్



**హైదరాబాద్, అక్టోబర్ 13 :** న్యాయరంగంలో సాంకేతికత విపరీతంగా పెరిగిందని.. ఇప్పుడు టెక్నాలజీ వాడి న్యాయపరమైన పత్రాలు రాయొచ్చు, అనాలిసిస్ చేయొచ్చని మంత్రి వివేక్ అన్నారు. టెక్నాలజీ తో పాటు హ్యూమానిటీ ఉండాలని.. ఎందుకంటే హ్యూమానిటీ లేకపోతే దీర్ఘకాలం ఏ రంగంలో నిలబడలేమని అన్నారు. బాగ్ లింగంపల్లిలోని అంబేద్కర్ లా కాలేజీలో విద్వత 2025 లా ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న లా ఫెస్టివల్‌ను మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 1990లలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు 2020లలో పూర్తిగా మారిపోయాయని... న్యాయరంగంలో కూడా న్యాయమూర్తుల దృక్పథం, న్యాయవాదుల వైఖరి మారుతోందని అన్నారు. మనం కూడా వాటికి అనుగుణంగా మారాలని అన్నారు. నేను స్వయంగా ఒక ఇండస్ట్రియలిస్ట్ ని.. 5 లక్షల పెట్టుబడితో ప్రారంభించి, 2 వేల కోట్ల వ్యాపారం వరకు తీసుకువచ్చానని అన్నారు. ఇది సాధ్యమైంది కేవలం కష్టపడి, నిజాయితీగా పనిచేయడం వల్లే అని అన్నారు మంత్రి వివేక్. నేను మెడిసిన్ డాక్టర్, ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు.. అయినా కానీ కామన్ సెన్స్, కష్టపడి పనిచేయాలనే ఆసక్తి వల్లే సాధించ గలిగానని అన్నారు.. ఏ రంగంలోనైనా విజయం కావాలంటే కష్టపడాలని, నిజాయితీగా ఉండాలని, మనుషుల సమస్యలు అర్థం చేసుకోవాలని అన్నారు. అంబేద్కర్ కళాశాల ఈ సారి దేశవ్యాప్తంగా విద్యార్థులను ఆహ్వానిస్తూ ఇలాంటి ఉత్సవం నిర్వహిం చడం గొప్ప విషయమని... కాకా కేవలం 10వ తరగతి చదివినవారు అయినా, పేదలకు విద్య అందించాలి, అవకాశాలు కల్పించాలి అన్న దృక్పథంతో ఉన్నారని అన్నారు. ఆ దృష్టిని ముందుకు తీసుకెళ్లడం మన బాధ్యత అని అన్నారు మంత్రి వివేక్. ఈ కళాశాల 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం ఒక గొప్ప ఆలోచన అని... ఇది పోటీని, కృషిని పెంచుతుందని అన్నారు మంత్రి వివేక్. మా కుటుంబం కార్మిక ఉద్యమం నేపథ్యంతో ఉందని... నేను కార్మిక శాఖ మంత్రిగా కొత్త చట్టాలపై పనిచేశానని... ముఖ్యంగా గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన రక్షణ ఉండేలా ఒక చట్టం రాబోతోందని అన్నారు. అలాగే పదేళ్లుగా పెరగని కనీస వేతనాల వ్యవస్థను సరిచేయడం కూడా జరుగుతోందని అన్నారు.

## అడవిలో సగంకాలిన మహిళ మృతదేహం

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 13 :** జిల్లాలోని పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామం సమీపంలోని అటవీప్రాంతంలో సగం కాలిన ఒక మహిళ మృతదేహం గుర్తించారు. అడవిలో దుర్వాసన వస్తోందని గుర్తించిన గ్రామస్థులు దగ్గరగా వెళ్లి చూసే సరికి ఈ దృశ్యం కనబడింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా, పెంట్లవెల్లి పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహం తీవ్రంగా కాలిపోవడంతో మహిళ ఎవరో గుర్తించడం సాధ్యంకాలేదు. శరీరం పక్కన ఎలాంటి వస్తువులు లభించకపోవడంతో పోలీసులు మృతురాలి గుర్తింపు కోసం సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారాన్ని పంపించారు. అలాగే మిస్సింగ్ కేసుల రికార్డులను కూడా పరిశీలిస్తున్నారు. మహిళ హత్యకు గురై ఉంటుందా, లేక ఆత్మహత్య చేసుకుందా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలించి ఆధారాలను సేకరిస్తోంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘట నతో మంచాలకట్ట పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెల కొంది. అడవుల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతుండటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

## మద్యం అదుపునకు కసరత్తు

**ఎమ్మెల్యే నిబంధనలు విధింపు**

**నల్లగొండ, అక్టోబర్ 13 :** ఎక్సైజ్ నిబంధనలకు తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సొంత నిబంధనలు ఖరారు చేయడం మునుగోడు జిల్లా నియోజకవర్గంలో సంచలనంగా మారింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిబంధనల పేరిట జారీ చేసిన అంశాలు చర్చనీయాంశంగా మారాయి. మునుగోడు నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని,వైన్ షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించారు. మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. వైన్ షాప్‌లు ఊరి బయట మాత్రమే పెట్టాలని,వైన్ షాప్ కు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఉండవద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని, లాటరీ విధానంలో వైన్స్ షాప్ లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదని పేర్కొన్నారు. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్‌ల నిర్మూలన, మహిళల సాధికారతే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

## అకాల వర్షంతో 6వేల కోళ్లు మృతి

**యాదాద్రి, అక్టోబర్ 13 :** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దకొండూరు గ్రామ పంచాయతీ నక్కలగూడెంలోని కోళ్లఫారంలోకి భారీగా వర్షపునీరు చేరింది. దీంతో సుమారు 6వేల కోళ్లు నీటమునిగి మృతిచెందినట్లు కోళ్లఫారం యజమాని తెలిపారు. మరోవైపు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వరి, పత్తి పంటలు నీటమునగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని అన్నారు.

## పెద్ద అంబర్‌పేటలో దొంగల బీభత్సం

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** హయత్‌నగర్ పీఎస్ పరిధి పెద్ద అంబర్‌పేటలో దొంగలు బీభత్సం సృష్టించారు. సదాశివ గేటెడ్ కమ్యూనిటీలో రెండిళ్లలో చోరీ చేశారు. సెంట్రల్ లాక్ ఉన్న డోర్లు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. 5 కేజీల వెండి, 35 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు, విలువైన చీరలను అపహరించారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఈ ప్రాంత వాసుల్లో భయం నెలకొంది.

## సీసీఐ దర్యాప్తుపై ఏషియన్ పెయింట్స్ పిటిషన్..

**తిరస్కరించిన సుప్రీం కోర్టు**

**దిల్లీ:** ఇటీవల మార్కెట్లో ఆధిపత్యాన్ని ఏషియన్ పెయింట్స్ దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) దర్యాప్తును ఆదేశించిన విషయం తెలిసిందే. దర్యాప్తును నిలిపివేయాలని ఏషియన్ పెయింట్స్ కోరగా.. ఆ పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది. జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయితో కూడిన ధర్మాసనం.. బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అంతేకాక హైకోర్టు కూడా సీసీఐ దర్యాప్తును సమర్థించింది. దీంతో ఏషియన్ పెయింట్స్ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ (బిర్లా పెయింట్స్ విభాగం) చేసిన ఫిర్యాదు ఆధారంగా సీసీఐ దర్యాప్తు ఆదేశం జారీ చేసింది. భారతీయ డెకరేటివ్ పెయింట్స్ విభాగంలో తమ ప్రవేశాన్ని అడ్డుకునే విధంగా ఏషియన్ పెయింట్స్ అన్యాయ వ్యూహాలు అవలంబించిందని గ్రాసిమ్ కంపెనీ ఆరోపించింది. ప్రస్తుత కేసులో కాంపిటీషన్ చట్టం 2002, సెక్షన్ 4(2) (ఎ), 4(2)(సి), 4(2) నిబంధనలను ఏషియన్ పెయింట్స్ ఉల్లంఘించినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని కమిషన్ అభిప్రాయ పడుతున్నట్లు సీసీఐ తన ఆదేశంలో పేర్కొంది. ఈ చట్టంలోని సెక్షన్ 4.. ఆధిపత్య దుర్వినియోగాన్ని నిషేధిస్తుంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి, 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని డైరెక్టర్ జనరల్ (డీజీ)ని సీసీఐ ఆదేశించింది. ఏషియన్ పెయింట్స్ తన డీలర్లను గ్రాసిమ్ వంటి పోటీదారులతో వ్యాపారం చేయకుండా అడ్డుకుంటోందని, వారికి అన్యాయ నిబంధనలు విధించిందని సీసీఐ పేర్కొంది.





## 100 శాతం వరకు పీఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ విషయంలో నిబంధనల సరళీకరణకు 'ఉద్యోగ భవిష్యనిధి సంస్థ' ముందుకొచ్చింది. ఇప్పుడు చందాదారులు.. ఉద్యోగి, యజమాని వాటా సహా పీఎఫ్ నిధిలో అర్హమైన బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో సమావేశమైన ఈపీఎఫ్‌వో 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్' ఈమేరకు నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఏడు కోట్లకు పైగా చందాదారులకు ప్రయోజనం కలగనుంది.

- పీఎఫ్ పాక్షిక విత్‌డ్రాకు సంబంధించిన 13 సంక్లిష్టమైన నిబంధనలను సీబీటీ ఒకే నిబంధనగా క్రమబద్ధీకరించింది. మూడు రకాలుగా.. 'ముఖ్యమైన అవసరాలు' (అనారోగ్యం, విద్య, వివాహం), 'గృహ అవసరాలు', 'ప్రత్యేక పరిస్థితులు'గా వర్గీకరించింది.
- విత్‌డ్రా లిమిట్స్ కూడా పెంచింది. చదువుల కోసం 10 సార్లు, వివాహం విషయంలో 5 సార్లు వరకు పాక్షిక విత్‌డ్రా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ రెండింటికీ మూడు సార్లవరకే అనుమతి ఉంది.
- అన్ని పాక్షిక ఉపసంహరణలకు చందాదారుల కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించింది.
- గతంలో 'ప్రత్యేక పరిస్థితులు' ఆప్షన్ కింద పాక్షిక పీఎఫ్ ఉపసంహరణకు నిరుద్యోగం, ప్రకృతి విపత్తులు, సంస్థల మూసివేత వంటి కారణాలు చూపాల్సి ఉండేది. ఇప్పుడు ఎటువంటి కారణాలు చెప్పకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు.
- పీఎఫ్ ఖాతాలో జమచేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస బ్యాలెన్స్‌గా ఉంచేలా నిబంధన రూపొందించారు. తద్వారా ఈపీఎఫ్‌వో అందించే అధిక వడ్డీ రేటు, పెద్దమొత్తంలో రిటైర్మెంట్ ప్రయోజనాలు పొందొచ్చు.

# ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు?




**ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్ఠం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఏపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు.**

ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు.ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు.

నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు. అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించ గలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్దం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితుల వుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధీ, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

## జూబ్లీహిల్స్‌లో మొదలైన నామినేషన్ల సందడి

### తొలిరోజు పదిమంది నామినేషన్లు దాఖలు

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక సందడి మొదలైంది. సోమవారం నామినేషన్లకు తొలిరోజు కావడంతో ఔత్సాహిక అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తొలిరోజు నామినేషన్ల పక్రియ పూర్తయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉండగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. తెలంగాణా పునర్నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా.. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం టర్నింగ్ అధికారి సోమవారం నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. షేక్ పేట్ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్ల స్వీకరణ పక్రియ కూడా ప్రారంభం అయ్యింది. అక్టోబర్ 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 22వ తేదీన దాఖలైన నామినేషన్ పరిశీలన ఉంటుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయిన రోజు సోమవారం ఫస్ట్ నామినేషన్ దాఖలు అయ్యింది. సిలివేరు శ్రీకాంత్ అనే వ్యక్తి రెండు సెట్ల నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు సిలివేరు శ్రీకాంత్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాగంటి సునీత పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఫైనల్ కాలేదు. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరుగుతుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గోపీనాథ్ భార్య సునీత బరిలోకి దిగుతున్నారు.

## పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరామర్శిం చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో భట్టి ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు.

## వేములవాడలో ఆలయ విస్తరణ పనులు

### భీమేశ్వరాలయంలో నిత్యపూజలు

**వేములవాడ, అక్టోబరు 11 :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నందున భక్తుల దర్శనాలు, పూజలను భీమేశ్వరాలయానికి మార్చారు. భక్తుల సౌకర్యార్థం మ్రొక్కుబడులు, ఆర్జిత సేవలకొరకై, అనగా కోడె మ్రొక్కుబడి, అభిషేకములు, అన్నపూజ, కుంకుమపూజ, నిత్య కళ్యాణము, చండి హెమం, మొదలగు మ్రొక్క బడులు తీర్చుకొనుటకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రధాన ఆలయములో నిత్య కైంకర్యములు, ఛత్సుకాల పూజలు, ఆలయ అర్చకులచే యధావిధిగా అంతరంగితముగా నిర్వహిస్తారు. ఈ ఏర్పాట్లను భక్తులు గమనించి సహకరించాలని వేములవాడ ఈ.ఓ ఒక ప్రకటన లో తెలిపారు.


## బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర

### కొత్త విద్యుత్ విధానంపై బివి రాఘవులు

**హైదరాబాద్, అక్టోబర్13 :** విద్యుత్ పంపిణీ సంస్థల ప్రమేయం లేకుండా కేంద్రం చట్టం చేయబోతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు చెప్పారు. బొగ్గు గనులను కార్పొరేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల లాభాల కోసం కేంద్రం ఇలా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై బీవీ రాఘవులు విమర్శలు గుప్పించారు. విద్యుత్ చట్ట సవరణ ప్రతిపానను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న చేసిందని తెలిపారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని పేర్కొన్నారు. గతం కంటే దుర్మార్గమైన అంశాలు ఇందులో ఉన్నాయని ఆరోపించారు. వినియోగదారుల, కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన ఈ విధానం ద్వారా అదానీ కంపెనీలకు అధిక లాభం కలగనుందని బీవీ రాఘవులు ఆరోపించారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీని ద్వారా రైతాంగానికి, ఉచిత గృహ విద్యుత్ పొందుతున్న వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం.. అదానీ కంపెనీలకు మేలు చేసేందుకు చేసిందే అని విమర్శించారు. జూలై 25న సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారని గుర్తుచేశారు.

## మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

### సిఎం రేవంత్, జర్నలిస్ట్ సంఘాల సంతాపం



**హైదరాబాద్, అక్టోబర్ 13 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (83) కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1982లో కాంగ్రెస్ తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగానూ లక్ష్మారెడ్డి పనిచేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నగరంలోని మహా ప్రస్థానంలో మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన కాంగ్రెస్ లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీసీసీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ ఛైర్మన్‌తో పాటు పలు కీలక బాధ్యతలను లక్ష్మారెడ్డి నిర్వర్తించారు. 1999, 2014లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు.జర్నలిజం పట్ల మక్కువతో లక్ష్మారెడ్డి 1980లో స్థానిక వార్తా సంస్థ ఎన్ఎస్ఎస్ మొదలుపెట్టారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలందించారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి మనవడు లక్ష్మారెడ్డి కావడం గమనార్హం. ఆయన మరణ వార్త తెలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ వార్తా ఏజెన్సీ స్థాపకుడిగా, ఎమ్మెల్యేగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ గా ఆయన సేవలందించారని కొనియాడారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు సీఎం సానుభూతి తెలియజేశారు. లక్ష్మారెడ్డి మృతిపట్ల ప్రెస్ అకడామ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అమర్, ఆర్ఎన్ఎ న్యూస్ ఏజెన్సీ ఎడిటర్ రఘు అవ్వారు, జర్నలిస్ట్ సంఘాల నేతలు నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు సంతాపం ప్రకటించారు.

## కరూర్‌లో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు : సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ :** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు నిరాకరించడంతో పిటిషనర్లు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తుపై పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కరూర్ తొక్కిసలాట నేపథ్యంలో పౌరుల ప్రాథమిక హక్కులపై జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఎన్.వి.అంజరియాలతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. దీనిపై అన్ని పార్టీలు వ్యక్తంచేస్తున్న అనుమానాలు తొలగాలంటే సమగ్ర దర్యాప్తు అవసరమని.. అందువల్లే ఈ కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రతినెలా కేసు పురోగతిని కోర్టుకు సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును విజయ్ ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలంతా పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టీవీకే పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది.

## ఆ బాధను సీఎం అర్థం చేసుకోలేరు

### అత్యాచార ఘటన వేళ దీదీపై విమర్శలు



**కోల్‌కత్తా :** పశ్చిమ బెంగాల్‌లో ఒడిశాకు చెందిన వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఆ బాధ ఆమెకు ఏం అర్థమవుతోందని ఒడిశాకు చెందిన మహిళా నేతలు మండిపడ్డారు. "ఆమె మాట్లాడుతున్నది ఏదో మాట్లాడనివ్వండి. ఆ బాధ ఆమెకు అర్థం కాదు. ఆ విద్యార్థినికి మేం కౌన్సిలింగ్ ఇస్తాం. మహిళల భద్రతకు భరోసా ఇవ్వకుండా.. రాత్రి బయటకు వెళ్లొదంటూ మమత చేసిన వ్యాఖ్యలు సరికాదు" అని ఒడిశా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శోవ్నా మోహంతీ విమర్శించారు. "దీదీగా పేరుపొందిన ఒక మహిళా నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం షాక్‌కు గురిచేసింది. బెంగాల్‌లోని మహిళలకు ఇది అవమానం" అని ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకుండా.. లింగ ఆధారిత అసమానత్వాన్ని తీసుకువస్తూ, బాలికల హక్కులు ప్రశ్నించడం ఏమాత్రం సరికాదన్నారు. ఆ విద్యార్థినిపై ఎలాంటి కనికరం లేకపోతే.. ఆ విషయాన్ని ఒడిశా ప్రభుత్వానికి రాతపూర్వకంగా తెలియజేయండని అసహనం వ్యక్తంచేశారు. "బాధితురాలు ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదువుతోంది. అర్ధరాత్రి 12.30కి అమ్మాయి బయటకు ఎలా వచ్చింది? నాకు తెలిసినంతవరకు ఈ ఘటన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆ సమయంలో ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే ఘటన. ఇటువంటి వాటిని తమ ప్రభుత్వం సహించదు. దోషులను కఠినంగా శిక్షిస్తాం" అని మమత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె బయటకు వెళ్లింది రాత్రి ఎనిమిది గంటలకు అని భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాకు చెందిన యువతి(23) పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లోని ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె ఫ్రెండ్‌తో కలిసి బయటకు వెళ్లగా, పలువురు దుండగులు వారిని వెంబడించారు. ఆ ఫ్రెండ్‌ను తరిమేసి.. ఆ విద్యార్థినిని సమీప అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో తాజాగా నాలుగో నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.



## పసిడి ధగధగలు

### రూ.1.30లక్షల దిశగా పరుగులు

**హైదరాబాద్ :** దేశీయ విపణిలో పసిడి ధరలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కన్పించట్లేదు. అంతర్జాతీయ పరిణామాలు, గిరాకీ ఇతరత్రా కారణాలతో బంగారం ధర అంతకంతకూ పెరుగుతూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ధనత్రయోదశి డిమాండ్‌తో ఈ వారాంతంలో పుత్తడి ధర దేశవ్యాప్తంగా రూ.1.30 లక్షలు దాటే అవకాశముందని బులియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,200 పలుకుతోంది. ఇక, హైదరాబాద్‌లో పుత్తడి ధర రూ.1,27,700కు చేరుకుంది. అటు కిలో వెండి ధర రూ.1.77లక్షలు దాటేసింది. గోల్డ్ ఈటీఎఫ్‌లు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో పుత్తడి రికార్డు స్థాయిలో పరుగులు పెడుతోందని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ వందనా భారతి తెలిపారు. ఈ ధనత్రయోదశి నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1,30,000 పైన ఉండొచ్చని అభిప్రాయ పడ్డారు. ఇక, 2026 ఆరంభం నాటికి రూ.1.50లక్షలకు చేరొచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,071.50 డాలర్లుగా ఉంది. ఈ వారాంతానికి ఔన్సు ధర 4,150-4,250 డాలర్లు చేరుకునే అవకాశముందని ఆమె తెలిపారు. ఇక, దేశీయంగా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.1,23,977 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. వెండి ధర కూడా రూ.లక్షన్నర దాటి పరిగెడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతల వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, రానున్న దీపావళి పర్వదినంతో పాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి.

## తాతకు నీళ్లు తీసుకెళ్తుండగా.. ఐదేళ్ల చిన్నారిపై చిరుత దాడి

**పుణె :** పొలంలో పని చేస్తున్న తాతకు తాగునీరు తీసుకెళ్తున్న ఐదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పింపారేడ్ గ్రామంలో ఆదివారం తమ ఇంటి సమీపంలోని పొలంలో పని చేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్య శైలేష్ బొంబే అనే ఐదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కిఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. దీన్ని గమనించిన అక్కడే పనిచేస్తున్న కొందరు వ్యక్తులు కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించడానికి కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని.. 10 బోన్లు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. స్థానికులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రూరమృగాల దాడిలో మరింత ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.

# కాలనీని మరింతగా అభివృద్ధి చేస్తాం


## అధ్యక్ష కార్యదర్శులు ఎం.నరేష్ గౌడ్, ఆర్.నాగిరెడ్డి

- హెూరాహెూరీగా సాగిన బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ ప్రత్యక్ష ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం
- సాధించిన కాలనీ అధ్యక్షులు మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, ట్రెజరర్ మునుకుంట్ల ప్రదీప్ గౌడ్
- ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల నాయకులు, కాలనీ ప్రజలు
- కాలనీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసిన అధ్యక్ష, కార్యదర్శులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** ప్రజలందరి సహకారంతో శక్తివంచన లేకుండా కాలనీ ని అన్ని విధాలుగా మరింతగా అభివృద్ధి చేస్తామని, కాలనీ సభ్యుల ఐక్యతే ముఖ్యమని, నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, కోశాధికారి మునుకుంట్ల ప్రదీప్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో కాలనీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రావు నాగిరెడ్డి, కోశాధికారిగా మునుకుంట్ల ప్రదీప్ గౌడ్ తమ ప్రత్యర్థులపై అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలుపొందారు. గెలుపొందిన కాలనీ కమిటీ సభ్యులను వివిధ పార్టీల నాయకులు కాలనీ ప్రజలు, మహిళలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పర్వతాపూర్ గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. శబరి గార్డెన్ వద్ద బాణా సంచా కాల్చుతూ ఆనందోత్సాహాలతో మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ... కాలనీలో ఐక్యత అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రతి ఒక్కరి సహకారంతో పెండింగ్లో ఉన్న అన్ని పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీలో సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నామని అన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చా రు. కాలనీలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా కుల మతాలక తీతంగా ప్రతి ఒక్కరం కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఏది ఏమైనా కాలనీ ప్రజల సమిష్టి కృషి పట్టుదల క్రమశిక్షణతో ఎన్నికలు జరిగాయని కాలనీ అడహాక్ సభ్యులందరికీ, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కమిటీ పదవీకాలం 3 సంవత్సరాలు ఉంటుందని కాలనీని మరింతగా అభివృద్ధి చేయాలని అడహాక్ కమిటీ సభ్యులైన ఎస్. సత్యనారాయణ, చేగూరి కుమార్, సిద్దేశ్వర్, ఎం. సదానందం లు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా క్రమశిక్షణతో ఎలాంటి విభేదాలు లేకుండా ఎన్నికలు నిర్వహించిన అడహాక్ కమిటీ సభ్యులను నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రశంసించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మునుకుంట్ల సహదేవ్ గౌడ్, దుబ్బాక వెంకటేష్ గౌడ్, బద్దం మల్లారెడ్డి, దేశగోని శ్రీనివాస్ గౌడ్, జైహింద్ గౌడ్, శ్రీను నాయక్, 5వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మునుకుంట్ల కిరణ్ గౌడ్, బల్లెపు చంద్రశేఖర్, చిలుముల అంజిరెడ్డి, మర్రి అంజిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గూడెం సత్యనారాయణ, 3, 4, 5 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలు బొడిగె ఉదయరాజు గౌడ్, యాసారం నగేష్, ముదిగొండ రమేష్, మర్రి జంగారెడ్డి, దుబ్బాక బిక్షపతి, యాసారం వెంకటేష్, మునికుంట్ల సునీల్, రాజీవ్, యాదగిరి, సందీప్, దుబ్బాక వినోద్, విక్రం, సందీప్, రవిచంద్ర, ఎర్ర నరసింహ, బొడిగె సాయి, బొడిగె రాజు, కాలనీ సభ్యులు గోవుల కృష్ణ, ప్రసాద్, నగేష్ గుప్తా, ఎస్. సుధాకర్, ఆర్. వేణు, ఎఫ్. రామకృష్ణ, ఎం వెంకటేష్, జలంధర్ రెడ్డి, రవీందర్, ప్రభాకర్, మన్నే. మహేష్, వివేక్ రెడ్డి, శేఖర్, సుధాకర్, రాజు, మురళి అచ్యుతారావు, కే. రాము, జె రాజేష్, ఇస్మాయిల్, ఎస్. పరమేష్, కాలేరు కృష్ణ, జగన్నాథ్ శర్మ, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.







## చేవెళ్ళ పట్టణంలోని షాబాద్ చౌరస్తాలో పోలీసుల తనిఖీలు

### ఎస్సై శిరీష ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** వాహన దారులు ఎవరైనా హెల్మెట్ లేకుండా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల పట్టణ ఎస్ ఐ శిరీష అన్నారు. బైకు నడుపుతున్న వారికి, అలాగే వెనకాల కూర్చున్న వారికి ఇద్దరికీ తప్పనిసరిగా హెల్మెంట్ ఉండాలని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఫోర్ వీలర్ డుపుతున్న వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకుని వాహనం నడపాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత వాహనదారుల ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు మీద వాహనం నడుపుతున్నప్పుడు తగు జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రయాణాలు చేయాలని కోరారు. అదేవిదంగా చేవెళ్ల బస్టాండు నుండి షాద్ నగర్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు లో ఫుట్ బోర్డు మీద ప్రయాణం చేస్తున్న విద్యార్థులను గమనించి, బస్సు ఆపి వారికి ఫుట్ బోర్డు మీద ప్రయాణం ప్రమాదకరమని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఫుట్ బోర్డు మీద ప్రయాణం చేస్తున్న వారిని లోపలికి పంపించారు. బస్సు డ్రైవర్ తో మాట్లాడి పలు సూచనలు చేశారు.



## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ మీద దాడిని ఖండిస్తూ వికారాబాద్‌లో నిరసన

- సీజేఐ పైన దాడి చేయడానికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్ పైన దేశద్రోహం కేసు నమోదు చెయ్యాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి ఆధ్వర్యంలో ధర్నా
- రాజ్యాంగ చట్ట వ్యతిరేక శక్తుల దాడులను తిప్పి కొట్టాలి
- మహాజన సోషలిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంద్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సీజేఐ గావాయ్ ఒంటరివాడు కాదని అతని వెనుక దళితులు పీడత వర్గాల శక్తులు బలంగా ఉన్నాయని గుర్తించుకోవాలని మహాజన సోషలిస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ అన్నారు. ధర్మం ముసుగులో అధర్మాలు చేస్తున్న రాజ్యాంగ చట్ట వ్యతిరేక శక్తుల దాడులను తిప్పి కొట్టాలని తెలిపారు. దళితుడైన బిఆర్ గవాయ్ దేశంలో అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టుకు చీఫ్ జస్టిస్ కావడం జీర్ణించుకోలేని ఈ దేశంలో ఉన్న అధర్మవాదులు జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం, అత్యంత పెద్ద న్యాయ వ్యవస్థ అయినటువంటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న గావాయ్ పైన దాడి చేయడం ముమ్మాటికి దేశద్రోహమే అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు తో ధర్నా కార్యక్రమం నిర్వహించి వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి గట్ట గళ్ళ ప్రశాంత్ మాదిగ, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాస్ మాదిగ, జిల్లా కార్యదర్శి అంజి మాదిగ, సీనియర్ నాయకులు భరత్ కుమార్, మహిళా నాయకురాలు పుష్పరాని, సి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు మంజుల, పద్మమ్మ, సునీత, ఆయా మండలాల ఇన్చార్జులు, అధ్యక్షులు శ్రీశైలం, బంటారం, యాలాల్- సూర్య ప్రకాష్, పూడూర్ యేసు, పరిగి రవి పాల్గొన్నారు.




## భయపెట్టిన ఫైర్ సిబ్బంది

### కోదాడ వ్యాపారం ప్రచారంపై నేలకొండపల్లిలో రగడ!

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లిలో ఫైర్ స్టేషన్ అధికారుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. కోదాడలో దీపావళి టపాసులు వ్యాపారం చేస్తున్న ఒక హెూల్‌సేల్ వ్యాపారి తమ బంధువుల షాపు దగ్గర నేలకొండపల్లిలో ఒక బ్యానర్ కట్టారు. ఈ వ్యాపారికి 365 రోజుల లైసెన్స్ కూడా ఉంది. అయితే, ఈ బ్యానర్‌ను వెంటనే తొలగించాలని నేలకొండపల్లి ఫైర్ సిబ్బంది ఆ షాపు యజమానిని గట్టిగా ఆదేశించారు.

**అధికారుల అత్యుత్సాహంపై ప్రశ్నలు.**

స్థానిక దీపావళి టపాసులు వ్యాపారులు కొందరు చెప్పడం వల్లే ఫైర్ సిబ్బంది ఇలా అత్యుత్సాహం చూపించారని తెలుస్తోంది. దీంతో వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, ఆ షాపు నడుపుతున్న 60 ఏళ్లు పైబడిన వృద్ధ వ్యాపారిని బ్యానర్ తీయాలని గట్టిగా చెప్పారు. దీనికి భయపడిన ఆ వ్యాపారి వెంటనే బ్యానర్‌ను తొలగించారు. బ్యానర్‌ల ద్వారా వ్యాపార ప్రచారం చేసుకోవడానికి చట్టపరంగా ఎటువంటి అడ్డంకులు లేనప్పటికీ, అధికారులు ఇలా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

**అసలు పనులను పక్కన పెట్టారా?**

ఫైర్ సిబ్బంది తమ ముఖ్యమైన విధులను పక్కన పెట్టి, ఇలాంటి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భద్రత పట్టదా? నేలకొండపల్లిలోని చాలా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాళ్లు, స్కూళ్లు, చిన్న పరిశ్రమల్లో (మేకింగ్ యూనిట్లలో) కనీస ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత) సౌకర్యాలు లేవు. ఇప్పటి వరకు ఫైర్ సిబ్బంది వాటిని స్వయంగా పరిశీలించి, నోటీసులు ఇవ్వలేదు.

**దీపావళి అమ్మకాల్లోనూ నిర్లక్ష్యం:**

దీపావళి టపాసులు అమ్మేవారు టెంపరరీ లైసెన్స్ కంటే ఎక్కువ మొత్తంలో మందుగుండు కొనుగోలు చేసి అమ్ముతున్నా చర్యలు లేవు. టెంపరరీ లైసెన్స్ గడువు ముగిసినా రహస్యంగా అమ్ముతున్నవారిని కూడా పట్టించుకోవడం లేదు. వారి అసలు విధులు వదిలిపెట్టి, ఎవరో చెప్పిన ఒక బ్యానర్‌పై ఇంత శ్రద్ధ చూపడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫైర్ సిబ్బంది తమ ముఖ్యమైన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఘనంగా రామారావు యాదవ్ జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన కొత్త కిషోర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, రాసాల కుమార్ యాదవ్, కొండ ఐలయ్య యాదవ్,



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల ద్వారకా నగర్ పేస్ 2 లో కోరాడ రామారావు యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే మంచి వ్యక్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాసాల కుమార్ యాదవ్, కుర్రి శివ శంకర్, యాదవ సంఘం ఈస్ట్ బోడుప్పల్ అధ్యక్షుడు కొండ ఐలయ్య యాదవ్, ద్వారక నగర్ ఫేస్ టు కాలనీవాసులు ఈస్ట్ బోడుప్పల్ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఆర్ ద్వారా కొంతమేరకు గుండె సాధారణ స్థితికి వచ్చే అవకాశం

### వికారాబాద్ డిఎంహెచ్ఓ పవిత్ర



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** నేటి నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిసాసిటిషన్) అవగాహన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర సోమవారం వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బంది చేత సిపిఆర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిపిఆర్ చేసే విధానం గురించి వీడియో ప్రదర్శన ద్వారా చూపించారు. అనంతరం డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితులలో తక్షణ స్పందనగా పక్కనున్నవారు సిపిఆర్ విధానం ద్వారా గుండె పనితీరును కొంతమేర సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చేసే ప్రక్రియనే సిపిఆర్ అన్నారు. సిపిఆర్ చేయడం వలన చాలా సందర్భాలలో రోగికి తక్షణ వైద్య సహాయం అందే వరకు ప్రాణాలు కాపాడేందుకు చేసే ప్రయత్నమని తెలిపారు. ఈ సి పి ఆర్ పై అవగాహన, శిక్షణ అక్టోబర్ 17వ తేదీ వరకు వైద్య సిబ్బందికి, విద్యార్థులకు, వృత్తి నిపుణులకు, సాధారణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వారి వారి పరిధిలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

## వైద్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

### మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

- సాయి ఐశ్వర్య కాలనీలో వైష్ణవి డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన మాజీ మేయర్



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** వైద్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొని ఉత్తమ సేవలు అందించాలని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి ఐశ్వర్యకాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన వైష్ణవి డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు సమీపంలోనే ఆధునిక వైద్య పరీక్షలు, నాణ్యమైన సదుపాయాలు అందుబాటులోకి రావడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు. నిర్వాహకులు జక్క రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యమే తమ ప్రాధాన్యమని, అత్యాధునిక పరికరాలతో, నిపుణుల బృందంతో ఈ సెంటర్‌ను ప్రారంభించామని, రక్తపరీక్షలు, స్కానింగ్, ఎక్స్-రే, ఈసీజీ వంటి అన్ని పరీక్షలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## సత్వరమే ప్రజా సమస్యల పరిష్కరించాలి

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో 56 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, ట్రైనీ కలెక్టర్ హార్స చౌదరి, డి ఆర్ ఓ మంగ్లీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాక్-అఫ్ఘాన్ యుద్ధం సంగతి చూస్తా

## యుద్ధాలను ఆపడంలో నేను నిపుణుడిని

- టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో 24 గంటల్లో భారత్-పాక్ యుద్ధం ఆగిపోయింది
- రష్యా రాజీకి రాకపోతే తోమహాక్ రంగంలోకి ..
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య



**న్యూయార్క్:** ప్రపంచంలో ఏమూల సైనిక ఘర్షణ జరిగినా ట్రంప్ అప్రమత్తమైపోతున్నారు. ఏడు యుద్ధాలను ఆపినట్లు వెల్లడించిన ఆయన తాజాగా ఎనిమిదో యుద్ధం ఆపబోతున్నట్లు వెల్లడించారు. గాజా ఒప్పందం కోసం పశ్చిమాసియాకు పయనమైన వేళ ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "నేను ఆపిన ఎనిమిదో యుద్ధం (గాజాలో) అవుతుంది. పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్‌ల మధ్య కూడా యుద్ధం జరుగుతోందని విన్నాను. నేను తిరిగి వచ్చేవరకు ఆగుతాను. నేను యుద్ధాలను ఆపడంలో నిపుణుడిని" అని ట్రంప్ పేర్కొన్నారు. టారిఫ్‌లను ఆయుధంగా వాడి తాను సంక్షోభాలను పరిష్కరించానని పునరుద్ఘాటించారు. దీనికి భారత్-పాక్ సైనిక ఘర్షణను ఆయన ఉదాహరణగా చూపారు. ఇరుదేశాలపై 100 నుంచి 150, 200శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించడంతో 24 గంటల్లో యుద్ధం ఆగిపోయిందన్నారు. టారిఫ్‌లు లేకపోతే తాను ఎప్పటికీ సమస్యను పరిష్కరించలేకపోయేవాడినని వెల్లడించారు.

### రష్యా రాజీకి రాకపోతే తోమహాక్ రంగంలోకి ..

ఉక్రెయిన్-రష్యా యుద్ధ పరిష్కారానికి కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. మాస్కో రాజీకి రాకపోతే.. తాను కీవ్‌కు తోమహాక్ క్షిపణులను అందజేస్తానని హెచ్చరించారు. అది పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుందని ఆయన వివరించారు. అదే సరైన చర్య అని అభివర్ణించారు. ఆదివారం ఉదయం ట్రంప్ ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో మాట్లాడిన తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. తమ మధ్య తోమహాక్‌పై సంభాషణ జరిగినట్లు ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు ఈ క్షిపణులను ఇస్తాననడంపై రష్యా అధినేత పుతిన్ స్పందించారు. వాటిని ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తే గనక మాస్కో-వాషింగ్టన్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. తాజాగా క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ.. ఉద్రిక్తతలు నాటకీయంగా పెరిగిపోతాయని అభివర్ణించారు. "ఒక దీర్ఘశ్రేణి క్షిపణి రష్యా పైకి దూసుకొస్తుంటే.. దానిలో అణ్వాస్త్రం కూడా ఉండొచ్చని మేము భావిస్తాం. అప్పుడు మేము(రష్యా) ఎలా ప్రతిస్పందించాలో సైనిక నిపుణులే అర్థం చేసుకోవాలి" అని పేర్కొన్నారు.

### ఏమిటీ తోమహాక్..

దాదాపు మూడు దశాబ్దాలకు పైగా చాలా యుద్ధాల్లో అమెరికా అత్యధికంగా ఉపయోగించిన ఆయుధాల్లో తోమహాక్ కూడా ఒకటి. ఇరాక్, సిరియా, లిబియా, గల్ఫ్, యెమెన్ యుద్ధాల్లో దీనిని అమెరికా విపరీతంగా వాడింది. తోమహాక్ ల్యాండ్ అటాక్ మిసైల్‌ను సముద్రంలో నౌకలు, జలాంతర్గాముల నుంచి శత్రు స్థావరాల పైకి ప్రయోగించవచ్చు. తొలిసారి 1970ల్లో ప్రచ్ఛన్నయుద్ధం వేళ దీని తయారీ తెర పైకి వచ్చింది. జనరల్ డైనమిక్స్ దీనిని అభివృద్ధి చేసింది. 1983 నాటికి అమెరికా సైన్యం చేతికి వచ్చింది. బూస్టర్ కాకుండా 5.6 మీటర్ల పొడవున్న ఈ క్షిపణి దాదాపు 1600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు 880 కిలోమీటర్ల వేగం (సబ్‌సోనిక్)తో ప్రయాణించగలదు. ఉపరితలానికి కేవలం 30-35 మీటర్ల ఎత్తులో ఎగిరే సామర్థ్యం ఉండటంతో.. ఇది చాలా దగ్గరికి వచ్చేవరకు దీన్ని రాడార్లు గుర్తించలేవు. సుమారు 450 కిలోల సంప్రదాయ వార్‌హెడ్‌ను దీనిలో అమర్చవచ్చు. అగ్రరాజ్యం వద్ద ఉన్న 140 నౌకలు, జలాంతర్గాముల్లో దీనిని ప్రయోగించే ఏర్పాట్లు ఉన్నాయంటే దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

### బాగ్దాద్ యుద్ధాన్ని ప్రారంభించి..

ఇరాక్‌పై డిజర్ట్‌స్ట్రామ్ పేరిట అమెరికా చేపట్టిన యుద్ధంలో మొట్టమొదట బాగ్దాద్‌పై ప్రయోగించిన ఆయుధం ఇదే. మొత్తం 42 రోజులపాటు జరిగిన ఈ వార్‌లో అమెరికా మొత్తం 297 క్షిపణులను వాడింది. వీటిల్లో 282 లక్ష్యాలను తాకాయి. కొన్నిసార్లు చాలా ఎక్కువ ఎత్తు నుంచి.. మరికొన్నిసార్లు తక్కువ ఎత్తు నుంచి ప్రయాణిస్తూ.. శత్రువును గందరగోళానికి గురిచేసి బాగ్దాద్‌పై విరుచుకుపడ్డాయి. ఒక్కో క్షిపణి ఖరీదు 2 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఈ క్షిపణిలో స్మార్ట్ నేవిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. దీంతో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యం వైపు దూసుకెళతాయి. జీపీఎస్, ఇనర్షల్ నేవిగేషన్ సిస్టమ్‌ను వాడుకొంటాయి. దీనిలో ఉండే వ్యవస్థలు ముందుగానే లోడ్ చేసిన మ్యాప్‌లను అనుసరిస్తూ టార్గెట్‌ను చేరుకోగలదు. అత్యాధునిక డేటా లింక్‌లు కూడా దీనికి ఉన్నాయి. ఫలితంగా మార్గమధ్యలో దీని దిశను మార్చవచ్చు. అవసరం అనుకుంటే మిషన్‌ను రద్దు చేసే అవకాశం కూడా ఉంది.

---



## ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి

### శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ తో కలిసి పంపిణీ చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి కుటుంబాల్లోనూ ఆడబిడ్డ పెళ్లి అంటే భారం కాకూడదని కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ద్వారా వారికి మేలు జరుగుతుందని అన్నారు. లబ్ధిపొందిన మహిళలు డబ్బులను వృధా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, తదితర డివిజన్ల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---




## పాలస్తీనా సంతోషిస్తుంటే..
## భగ్గుమంటోన్న పాకిస్థాన్

**పాకిస్థాన్ :** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు చేస్తోన్న ఆందోళనలతో పాకిస్థాన్ భగ్గుమంటోంది. గతవారం మొదలైన ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసుల ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దాంతో ఒక అధికారి సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహోర్‌లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గాజా యుద్ధం ముగింపుపై పాలస్తీనా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తుంటే.. పాక్ హింసాత్మకంగా మారడం గమనార్హం. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా టీఎల్‌పీ లాహోర్, ఇతర ప్రాంతాల్లో కొంతకాలంగా నిరసనలు చేపడుతోంది. ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన తర్వాత ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి ప్లాన్ చేసింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తోన్న ప్రయత్నాలు హింసాత్మకంగా మారుతున్నాయి. పంజాబ్ పోలీస్ చీఫ్ ఉస్మాన్ అన్వర్ మాట్లాడుతూ.. అధికారులపై ఆందోళనకారులు కాల్పులు జరిపారని వెల్లడించారు. దాంతో ఒక పోలీసు అధికారి సహా ఐదుగురు మరణించారు. తమ మద్దతుదారులు అనేకమంది మరణించారని, గాయపడ్డారని టీఎల్‌పీ చెప్తోంది. పోలీసులు నిరసనకారులపై జరిపిన కాల్పుల్లో టీఎల్‌పీ చీఫ్ సాద్ రిజ్వీ గాయపడినట్లు తెలుస్తోంది. కాల్పులకు ముందు ఆయన విడుదల చేసిన వీడియోలో ఫైరింగ్ చేయొద్దని పోలీసులను కోరినట్లు కనిపిస్తోంది. చర్చలకు తాము సిద్ధమని అభ్యర్థించారు. ఈ వీడియోలో తుపాకీ పేలుళ్ల శబ్దం వినిపించింది. మరొక వీడియోలో.. పలు వాహనాలు మంటల్లో దగ్ధమవుతున్నాయి. ఆందోళనకారులు ఇస్లామాబాద్ వైపుగా వెళ్లకుండా రోడ్లపై షిప్పింగ్ కంటైనర్లను అడ్డుగా పెట్టారు. వాటిని తొలగించడంతో తాజాగా మరోమారు ఘర్షణలు చెలరేగాయి. టీఎల్‌పీ ప్రదర్శనలపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గాజాలో యుద్ధం ముగుస్తోన్న సమయంలో ఈ పార్టీ నిరసనకు దిగడమేంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ సమయంలో వేడుకలు చేసుకోవాల్సిందిపోయి, హింసకు దిగడమేంటో అర్థం కావడం లేదని పాక్ మంత్రి తలాల్ చౌధరీ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఇక నిరసన ప్రారంభం కావడానికే ముందు రోడ్లను దిగ్బంధించి ప్రభుత్వం అతిగా స్పందించిందని కొందరు విమర్శించారు.

---

## భూటాన్ వల్లే బెంగాల్‌లో వరదలు..

### పరిహారం చెల్లించాలి : మమతా బెనర్జీ



**పశ్చిమ బెంగాల్ :** ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో భారీ వరదలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జల్‌పాయిగుడీ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూటాన్ నుంచి వెల్లువెత్తిన జలప్రవాహం కారణంగానే వరదలు సంభవించాయని ఆరోపించారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. "భూటాన్ నుంచి ముంచుకొచ్చిన నదీ జలాల కారణంగానే మాకు నష్టం జరిగింది. ఆ దేశం పరిహారం చెల్లించాలి" అని సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే అన్ని సహాయక, పునరావాస చర్యలు చేపడుతోందన్నారు. కేంద్రం తరఫున ఎటువంటి ఆర్థిక సాయం లేదని ఆరోపించారు. భారత్-భూటాన్ ఉమ్మడి నదీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అందులో పశ్చిమ బెంగాల్‌ను భాగం చేయాలని తమ ప్రభుత్వం చాలా కాలంగా డిమాండ్ చేస్తోందన్నారు. తమ ఒత్తిడితో ఈ నెల 16న కేంద్రం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని, దీనికి రాష్ట్ర అధికారులు హాజరవుతారని వెల్లడించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, జల్‌పాయిగుడీ తదితర ప్రాంతాల్లో వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 32 మంది మృతి చెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నేపాల్, భూటాన్‌లోనూ ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం వాటిల్లింది. ఈ వరదలు, వాటి వల్ల జరిగిన విధ్వంసానికి మానవ తప్పిదమే కారణమని దీదీ ఇటీవల ఆరోపించారు. వరద ప్రభావిత ప్రాంతాలను ఆమె సందర్శించడం ఇది రెండోసారి.

---

## ప్రపంచానికి మరింత మంది
# ట్రంప్‌లు కావాలి

- ఇజ్రాయెల్ కనేసేట్ స్టాండింగ్ ఓవేషన్
- బెంజమిన్ నెతన్యాహు సర్కారు ఘనంగా కృతజ్ఞతలు
- శాంతి బహుమతికి ట్రంప్ పేరు



**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు బెంజమిన్ నెతన్యాహు సర్కారు ఘనంగా కృతజ్ఞతలు తెలిపింది. ఇజ్రాయెల్ చట్టసభ కనేసేట్ ఆయనకు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చింది. ప్రపంచానికి ట్రంప్ లాంటి వారు మరింత మంది కావాలని ఆకాంక్షించింది. వచ్చే ఏడాది ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదిస్తామని తెలిపింది. ట్రంప్ సోమవారం ఇజ్రాయెల్ లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి చప్పట్లతో కృతజ్ఞతలు తెలియజేశారు.

### శాంతి బహుమతికి ట్రంప్ పేరు..

అనంతరం స్పీకర్ అమిర్ ఒహానా మాట్లాడుతూ.. బందీల విడుదలకు కృషి చేసిన ట్రంప్‌ను యూదు ప్రజలు వేల సంవత్సరాల పాటు గుర్తుంచుకుంటారని కొనియాడారు. శాంతి స్థాపన కోసం ఆయన చేస్తున్నంతగా ఎవరూ చేయడం లేదని అన్నారు. దృఢ సంకల్పం, ధైర్యం ఉన్న ట్రంప్ లాంటి నేతలు ప్రపంచానికి మరింతమంది కావాలని అభిప్రాయపడ్డారు. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ కంటే అర్హులు ఇంకెవరూ లేరని తెలిపారు. వచ్చే ఏడాది నోబెల్ పురస్కారం కోసం అన్ని దేశాలు ట్రంప్ పేరు ప్రతిపాదించేలా తాము కృషి చేస్తామన్నారు.

### ప్రపంచాన్ని కదిలించిన వ్యక్తి ట్రంప్

అనంతరం నెతన్యాహు ప్రసంగిస్తూ ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ప్రపంచాన్ని ఇంత వేగంగా, దృఢనిశ్చయంతో కదిలించిన ట్రంప్ లాంటి వ్యక్తిని ఇంతవరకూ చూడలేదన్నారు. యుద్ధం ముగిసేలా గాజా ఒప్పందం చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శాంతి స్థాపన కోసం తామూ కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ట్రంప్ తప్పకుండా నోబెల్ శాంతి బహుమతి సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### బహుమతిగా బంగారు పావురం

అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ కొంతసేపు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడికి నెతన్యాహు అపురూప కానుక ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపన కోసం పాటుపడుతున్న ట్రంప్‌నకు బంగారు పావురాన్ని బహుమతిగా అందజేశారు. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ తమ చెరలో ఉన్న బందీలను సోమవారం విడిచిపెట్టింది. ఇందుకు ప్రతిగా పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఇక, రెండో దశ కాల్పుల విరమణ చర్చల కోసం ఈజిప్టులో చర్చలు జరగనున్నాయి. ఇందుకు నెతన్యాహుకు ఆహ్వానం లభించగా.. ముందస్తు కార్యక్రమాల దృష్ట్యా ఆయన హాజరుకావట్లేదు. ఈ చర్చల్లో ట్రంప్ పాల్గొననున్నారు.

---

# రెండేళ్ల తర్వాత విముక్తి..

### బందీలను విడుదల చేసిన హమాస్



**హమాస్ :** దాదాపు రెండేళ్లుగా హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారికి సోమవారం విముక్తి లభించింది. తొలుత ఏడుగురు బందీలను రెడ్‌క్రాస్‌కు హమాస్ అప్పగించింది. ఆ తర్వాత కాసేపటికి మిగతా 13 మంది బందీలను విడిచిపెట్టింది. వారిని తీసుకుని రెడ్‌క్రాస్ వాహనశ్రేణి ఇజ్రాయెల్‌కు బయల్దేరింది. బందీలు విడుదలవడంతో వారి కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. ఇక, హమాస్ వద్ద ఉన్న 28మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను కూడా త్వరలోనే అప్పగించనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్ ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నుంచే ఈ ఒప్పందం అమల్లోకి రాగా.. బందీల విడుదల నేడు ప్రారంభమైంది. ఒప్పందం కింద తమ వద్ద ఉన్న 48 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. అయితే, ఇందులో 20 మందే సజీవంగా ఉన్నారు. వీరిని గాజాలోని మూడు ప్రాంతాల్లో హమాస్ విడుదల చేసింది. ఇందుకు ప్రతిగా 2వేల మందికి పైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసి 1200 మందిని హత్య చేసి, 251 మందిని హమాస్ అపహరించిన సంగతి తెలిసిం దే. వారిలో కొంతమందిని గతంలో విడుదల చేసింది. కొంద రిని ఇజ్రాయెల్ సైన్యం రక్షించింది. మరికొంతమంది ప్రాణా లు కోల్పోయారు. మిగిలినవారిని హమాస్ ఇప్పుడు విడిచిపెట్టింది. ఈ విడుదల కార్యక్రమం ముగిసిన తర్వాత ట్రంప్ శాంతి ప్రణాళికలో రెండో దశపై చర్చలు ప్రారంభమవుతాయి. ఇందులో హమాస్ ఆయుధాలను త్యజించడం.. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ప్రధాన అంశాలు. ఈ చర్చలకు అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులుగా వ్యవహ రిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం , ఈజిప్టు లలో పర్యటించనున్నారు. తొలుత ఆయన జెరూసలెంలో ఇ జ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు. బందీల కు టుంబసభ్యులను కలుస్తారు. అక్కడి నుంచి ఈజిప్టు వెళతారు.

---



## యలమంచి ఉదయ్ కిరణ్ చే క్రికెట్ టోర్నమెంట్ విజేత లకు బహుమతుల పంపిణీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మియాపూర్ లోని నీలిమ గ్రీన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ అకాడమీ (సి వో ఈ సి) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ అవార్డు పంపిణీ కార్యక్రమం ను ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపకుడు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలు, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుల గ్రహీతలు, బెస్ట్ వికెట్ కీపర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్లకు మెమెంటోలు, షీల్డ్స్ అందజేశారు. యలమంచి ఉదయ్ కిరణ్ తన ప్రసంగంలో " క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. ఇలాంటి అకాడమీలు భవిష్యత్తు క్రీడా ప్రతిభావంతులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి," అని పేర్కొన్నారు. విజేతలు, వారి తల్లిదండ్రులను వారి నిరంతర ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, అకాడమీ ఫౌండర్ మానస్ ముట్టవారపు, కోచులు దివాకర్, విష్ణు లను, వారి అద్భుత శిక్షణా నైపుణ్యాలు , యువ క్రీడాకారుల ప్రతిభాభివృద్ధిలో చేసిన అంకితభావం కోసం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలో వారికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో శరత్, రాధాకృష్ణ, గోకినేపల్లి రమేష్, మధు, సతీష్, సహా అనేక చిన్నారులు, తల్లిదండ్రులు, కోచులు , గ్రౌండ్ సిబ్బంది ఘనంగా పాల్గొన్నారు.

---





## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి డివిజన్ లో గల వెజిటేబుల్ మార్కెట్ లో గ్యార్వి షరీఫ్ సందర్భంగా మార్కెట్ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా కమిటీ వారు ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని త్వరలో శంకుస్థాపన కార్యక్రమాన్ని అందరి సమక్షంలో జరుపుకునే విధంగా కార్యాచరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, యూసుఫ్, అక్బర్, వైస్ ప్రెసిడెంట్ ఖాజా పాషా, అజామ్, అజీమ్, సల్మాన్, మోయస్, శ్రీనివాస్, రాజు, లాల, చిన్న, రవి, ప్రభాకర్ రెడ్డి, షరీఫ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాల నడుమ మన సూచీలు నష్టాల బాటపట్టాయి. చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో మదుపర్లు అత్యంత అప్రమత్తత పాటించారు. దీంతో సెన్సెక్స్ 173 పాయింట్ల మేర పడిపోగా.. నిఫ్టీ 58 పాయింట్లు క్షీణించింది. ఉదయం 82,049.16 వద్ద నష్టాల్లో ప్రారంభమైన సూచీ ఒక దశలో 82,438.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 173.77 పాయింట్లు నష్టపోయి 82,327.05 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 58 పాయింట్లు క్షీణించి 25,227.35 వద్దకు చేరింది. రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 88.66 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్, విప్రో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు లాభపడ్డాయి.









## వాణిజ్య చర్చలు..

### అమెరికా పర్యటనకు భారత ప్రతినిధి బృందం

**దిల్లీ:** భారత సీనియర్ అధికారిక బృందం ఈ వారం అమెరికా పర్యటనకు వెళ్లనుంది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చల కోసం వెళ్లనున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంపై భారత్, అమెరికా మధ్య చర్చలు సక్రమంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉభయదేశాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించి తొలి దశ చర్చలను ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో పూర్తి చేయాలని షెడ్యూల్ చేశారు. ఇప్పటివరకు ఐదు దశల్లో ఈ వాణిజ్య చర్చలు ముగిశాయి. గత నెలలో వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ వాణిజ్య చర్చల కోసం అధికార ప్రతినిధి బృందంతో కలిసి న్యూయార్క్ వెళ్లారు. ఆ సమావేశం తర్వాత పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో చర్చలను కొనసాగించాలని భారత్, అమెరికా నిర్ణయించుకున్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పీయూష్ గోయల్ ఈ పర్యటనలో.. అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, భారతదేశానికి అమెరికా రాయబారిగా నియమితుడైన సెర్జియో గోర్‌తో సమావేశమయ్యారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసినందుకు అమెరికా భారత నుంచి వచ్చే వస్తువులపై 25 శాతం పరస్పర సుంకంతో పాటు మరో 25 శాతం అదనపు పన్ను విధించింది. ప్రస్తుతం అమెరికా మార్కెట్లోకి ప్రవేశించే భారత వస్తువులపై మొత్తం 50 శాతం అదనపు దిగుమతి సుంకం అమల్లో ఉంది. ప్రస్తుతం భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 191 బిలియన్ డాలర్లు కాగా.. ఈ ఒప్పందం ద్వారా 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

# భారత్ విజయానికి 58 పరుగులు

### నాలుగో రోజు ముగిసిన ఆట

### రాణించిన బూమ్రా, కుల్‌దీప్





**దిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ విజయానికి 58 పరుగుల దూరంలో నిలిచింది. 121 పరుగుల లక్ష్యఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 63/1తో నిలిచింది. కేఎల్ రాహుల్ (25), సాయి సుదర్శన్ (30) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం బాదిన యశస్వి జైస్వాల్ (8) ఈసారి త్వరగా పెవిలియన్ చేరాడు. ఫాలోఆన్‌లో ఓవర్‌నైట్ 173/2 స్కోరుతో నాలుగో రోజును ప్రారంభించిన విండీస్ 390 పరుగులకు ఆలౌటైంది. కాంప్‌బెల్ (115.. ఓవర్‌నైట్ 87), షై హోప్ (103... ఓవర్‌నైట్ 66) సెంచరీలు చేశారు. జస్టిన్ గ్రీవ్స్ (50), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) రాణించారు. కుల్‌దీప్ యాదవ్ 3, బుమ్రా 3, సిరాజ్ 2, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేయగా.. విండీస్ 248 పరుగులకే కుప్పకూలి 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడింది. కాంప్ బెల్, హోప్ సెంచరీలు చేసి విండీస్‌ను ఇన్నింగ్స్ ఓటమి నుంచి గట్టెక్కించారు. తొలి సెషన్‌లో కాంప్‌బెల్‌ని ఔట్ చేసిన కుల్‌దీప్ భారత్‌కు బ్రేక్ అందించాడు. ఈ క్రమంలో లంచ్ బ్రేక్ సమయానికి వెస్టిండీస్ 252/3తో మెరుగైన స్థితిలోనే కనిపించింది. రెండో సెషన్‌లో భారత బౌలర్లు పుంజుకోవడంతో వం-సగా వికెట్లు కోల్పోయింది. సెంచరీ చేసిన కాసేపటికే షై హోప్‌ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. తర్వాత కుల్‌దీప్ స్వల్ప వ్యవధిలో టెవిన్ ఇమ్లాచ్ (12), రోస్టన్ ఛేజ్, ఖేరీ పియర్ (12)లను ఔట్ చేసి విండీస్‌ను దెబ్బకొట్టాడు. బుమ్రా కూడా జోరందుకుని జోమెల్ వారికన్ (3), అండర్సన్ ఫిలిప్ (2)ని వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో జస్టిన్ గ్రీవ్స్, జైడెన్ సీల్స్ క్రీజులో పాతుకుపోయారు. భారత బౌలర్లు వికెట్ కోసం ఎంత ప్రయత్నించినా నిలకడగా ఆడారు. దీంతో టీ బ్రేక్ సమయానికి విండీస్ 361/9తో నిలిచింది. చివరి సెషన్‌లో మరో 29 పరుగులు చేసి వెస్టిండీస్ ఆఖరి వికెట్ కోల్పోయింది. బుమ్రా బౌలింగ్‌లో సీల్స్ పదో వికెట్‌గా వెనుదిరిగాడు. గ్రీవ్స్, సీల్స్ పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాన్ని (132 బంతుల్లో) నెలకొల్పడం విశేషం.

## జట్టుకు ఎంపిక కాకపోతే బాధే మరి..

### వారిద్దరే నాకు స్ఫూర్తి : అభిమన్యు



భారత జట్టులో ఆడాలనేది ప్రతి క్రికెటర్ కల. అందు కోసం దేశవాళీలో భారీగా పరుగులు చేస్తే అవకాశం వస్తుందనేది వారి ఆలోచన. కానీ, ఓ క్రికెటర్‌కు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. అతడేమన్నా సరైన ఆటతీరు ప్రదర్శించడం లేదా? అంటే అదేం కాదు. దేశవాళీలో అభిమన్యు ఈశ్వరన్ పేరు చెబితే ఠక్కున గుర్తుపడతారు. భారత్ జట్టుకూ సారథ్యం వహించిన అనుభవం ఉంది. అలాగని అతడిని జాతీయ జట్టులోకి తీసుకోవడం లేదా? అంటే అదీ కాదు. సిరీస్‌లకు ఎంపికైనా సరే తుది జట్టులో మాత్రం ఛాన్స్ రాలేదు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. స్వదేశంలో విండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక కాలేదు. ఇప్పటికే అభిమన్యు తండ్రి తీవ్ర అసహనం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అభిమన్యు తన ఆవేదనను వ్యక్తంచేశాడు. "కొన్నిసార్లు ఇలాంటి నిర్ణయాలు తీవ్రంగా బాధిస్తాయి. బాగా ఆడి.. కఠినంగా శ్రమించినా సరే కల నెరవేరకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. అయితే, మద్దతుగా నిలిచే కుటుంబం, స్నేహితులు, కోచ్ ఉండటం వల్ల ఆ బాధ నుంచి కోలుకోలుగుతున్నా. నన్ను ఎప్పటికప్పుడు ఉత్సాహపరుస్తూ ఉంటారు. అలా ఉండటం కూడా అదృష్టమే. రాబోయే రంజీ సీజన్ కోసం ఇప్పట్నుంచే సాధన మొదలుపెట్టా. నా చేతుల్లో ఏముందనే దానిపై దృష్టిపెట్టా. కష్టపడతా. ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తా. నన్ను నేను మెరుగుపర్చుకొనేందుకు చూస్తా. ఈ సీజన్ కోసం కొత్త షాట్లను ఆడటంపై దృష్టిపెట్టా. అవేంటనేది ఇప్పుడే చెప్పలేను. తప్పకుండా నాతోపాటు మా జట్టుకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నా. భారత జట్టుకు ఆడటం ఎప్పటికీ మోటివేషన్. అయితే, బెంగాల్ తరఫున ఆడుతున్నా సరే అలాగే గర్వపడతా" అని అభిమన్యు తెలిపాడు.

#### అతడికి బిగ్ ఫ్యాన్‌ను..

30 ఏళ్ల వయసులోనూ అవకాశాలు దక్కించుకున్న మైకెల్ హస్సీ, సూర్యకుమార్ యాదవ్ తనకు స్ఫూర్తి అని అభిమన్యు వ్యాఖ్యానించాడు. "నేను ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైకెల్ హస్సీకు పెద్ద ఫ్యాన్‌ను. అతడు ఆసీస్‌కు డెబ్యూ చేయకముందు దేశవాళీలో భారీగా పరుగులు చేశాడు. అతడి క్రికెట్ ప్రయాణం చూస్తే చాలు ఏదైనా సాధించవచ్చని తెలిసిపోతుంది. ఇక టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా 30 తర్వాతనే అరంగేట్రం చేశాడు. ఇప్పుడు జట్టును నడిపిస్తున్నాడు. మాలాంటి క్రికెటర్లకు వీరిద్దరూ మంచి ఉదాహరణలు. నేను కూడా అలా చేయగలనని మా మనసుకు చెబుతూ ఉంటా" అని అభిమన్యు వెల్లడించాడు. దేశవాళీలో అభిమన్యు 7,600కి పైగా పరుగులు చేశాడు. ఇందులో 27 సెంచరీలు, 29 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## నీరజ్ మరో మెడల్ తెస్తాడు.. సచిన్ 95 మీటర్లు విసిరేస్తాడు


### క్లాస్ బార్టోనిట్జ్




భారత ఒలింపిక్స్ చరిత్రలో జావెలిన్ త్రోలో రెండు పతకాలు సాధించిన అథ్లెట్‌గా నీరజ్ చోప్రా నిలిచాడు. 2020, 2024 ఒలింపిక్స్‌ల్లో స్వర్ణ, రజత పతకాలను సొంతం చేసుకున్నాడు. కానీ, ఆ తర్వాత అతడి ప్రదర్శన అనుకున్నంత స్థాయిలో లేదు. ఇటీవల ముగిసిన వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో కేవలం 84.03 మీటర్లే విసిరాడు. అదే టోర్నీలో సచిన్ యాదవ్ మాత్రం అద్భుతమైన ప్రదర్శన చేశాడు. కేవలం 40 సెం.మీల వ్యత్యాసంతో పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ క్రమంలో నీరజ్ మాజీ కోచ్ క్లాస్ బార్టోనిట్జ్ మాత్రం వీరిద్దరిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నీరజ్ నుంచి తప్పకుండా మరో ఒలింపక్ పతకం ఆశించవచ్చని.. సచిన్ యాదవ్ కూడా ఈ రేసులో ఉంటాడని తెలిపాడు. "వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సచిన్ యాదవ్ పతకం గెలుస్తాడని అనుకున్నా. ఒకవేళ అలాచేసి ఉంటే నేనేమీ ఆశ్చర్యపోను. అతడు దాదాపు 86 మీటర్ల దూరం విసిరాడు. చాలా ఎత్తుగా ఉండడం సచిన్‌కు బెనిఫిట్‌గా మారనుంది. టెక్నికల్‌గానూ మెరుగైన అథ్లెట్. నీరజ్, సచిన్ మానసికంగా బలమైన వ్యక్తులు. సచిన్ తప్పకుండా 90 మీటర్ల టార్గెట్‌ను చేరుకోగలడని భావిస్తున్నా. 95 మీటర్లు కూడా అసాధ్యమేమీ కాదు. మనం వాస్తవిక పరిస్థితుల గురించి మాట్లాడుకుందాం. 2016లో నీరజ్ 18 ఏళ్ల వయసులో తొలిసారి 86 మీటర్లు విసిరాడు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత 90 మీటర్లకు చేరువగా వచ్చాడు. ఇప్పుడు సచిన్‌కు 24 ఏళ్లు ఉంటాయి. అతడు 95 మీటర్ల దిశగా సాగుతున్నాడు. ఈ మార్గం చాలా కష్టమైందే. జోహెన్నెస్ వెటర్ 97 మీటర్ల దూరాన్ని కూడా ఛేదించాడు. ఈ నంబర్ తప్పకుండా మిగతా అథ్లెట్ల మదిలో కదులుతూనే ఉంటుంది. రాబోయే ఒలింపిక్స్‌లో తప్పకుండా నీరజ్ మూడో పతకాన్ని సాధించగలడని భావిస్తున్నా. గతంలో జాన్ జెలెన్కీ కూడా మూడు పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. సచిన్ కూడా ఇలాగే కొనసాగితే తప్పకుండా ఒలింపిక్స్‌లో అడుగు పెడతాడు" అని వ్యాఖ్యానించాడు.

# హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకోబోం

### టీసీఎస్ సీఈఓ కీలక వ్యాఖ్యలు




హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లుకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం టెక్ కంపెనీల్లో గందరగోళానికి దారితీసింది. ఈ భారీ మొత్తం ఫీజుతో సంస్థలపై అదనపు భారం పడనుంది. ఈ పరిణామాల వేళ టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది హెచ్-1బీ కింద కొత్త నియామకాలు చేపట్టబోమని తెలిపారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దీనిపై స్పందించారు. "అమెరికాలో మాకు సరిపడా హెచ్-1బీ ఉద్యోగులు ఉన్నారు. అగ్రరాజ్యంలో మా కంపెనీలో 32,000-33,000 సిబ్బంది ఉండగా.. ఇందులో దాదాపు 11వేల మంది హెచ్-1బీ పైన వచ్చినవారే. ఈ ఏడాది ఇప్పటికే 500 మందిని ఈ వీసాలతో భారత్ నుంచి అమెరికాకు పంపించాం. అయితే, ప్రస్తుత ఏడాదిలో హెచ్-1బీ కింద కొత్త ఉద్యోగులను నియమించుకునే ప్రణాళిక లేదు. స్థానిక ఉద్యోగుల (అమెరికన్లను ఉద్దేశిస్తూ) నియామకాలే కొనసాగిస్తాం. హెచ్-1బీ వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలనుకుంటున్నాం. ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉంది. అయితే, అవి పూర్తిగా హెచ్-1బీని భర్తీ చేయలేవు" అని కృతివాసన్ వెల్లడించారు. ఇటీవల టీసీఎస్‌లో 2శాతం మేర ఉద్యోగుల తొలగింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపైనా కంపెనీ సీఈఓ స్పందించారు. కంపెనీ భవిష్యత్తును దృష్టిలోఉంచుకొని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. బాధిత ఉద్యోగులకు మెరుగైన తొలగింపు ప్యాకేజీని అందించినట్లు వెల్లడించారు. ఇక, ఏఐ డేటా కేంద్రాల్లో దాదాపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కృతివాసన్ తెలిపారు. అమెరికాలో హెచ్-1బీ ఉద్యోగులను అత్యధికంగా నియమించుకుంటున్న కంపెనీల జాబితాల్లో టీసీఎస్ మొదటివరుసలోనే ఉంది. 2009 నుంచి 2025 మధ్య 98,259 మంది హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే 5,505 మందిని తీసుకుంది.




## తమిళనాడులో ఫాక్స్‌కాన్ భారీ పెట్టుబడి

యాపిల్ ఐఫోన్ల కాంట్రాక్ట్ తయారీదారు ఫాక్స్‌కాన్ తమిళనాడులో భారీగా పెట్టుబడి పెట్టనుంది. ఈ మేరకు కంపెనీ రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు 14 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. తమిళనాడు ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడుల్లో ఇదే అతిపెద్దదని రాష్ట్ర పారిశ్రామిక శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'తమిళనాడులో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఇంజినీరింగ్ పెట్టుబడి. ఫాక్స్‌కాన్ రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు 14 వేల ఉన్నతస్థాయి ఉద్యోగాలు కల్పించనుంది. ఇంజినీర్లు సిద్ధమవండి' అని పోస్ట్ చేశారు. తైవాన్‌కు చెందిన ఈ సంస్థకు అవసరమైన అనుమతులు వేగంగా లభించేలా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ 'గైడెన్స్ తమిళనాడు' ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటుచేయనుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫాక్చరింగ్ రంగాల్లో తమిళనాడుకి మరో పెద్ద ప్రోత్సాహం లభించిందని ఆయన తెలిపారు. ఫాక్స్‌కాన్ ఇండియా ప్రతినిధితో ముఖ్యమంత్రి స్టాలిన్ భేటీ అయ్యి, తమిళనాడుపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరిచారని టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు.




## టాటా సన్స్ లిస్టింగ్‌కు టాటా ట్రస్ట్స్ విముఖత..?

టాటా గ్రూప్ ప్రధాన సంస్థ 'టాటా సన్స్' స్టాక్ మార్కెట్లలోకి అడుగుపెట్టే అంశంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ కంపెనీ ఐపీఓకు టాటా ట్రస్ట్స్ అనుకూలంగా లేదని తెలుస్తోంది. టాటా సన్స్ లిస్టింగ్ అయితే.. దీనిపై తమ నియంత్రణ తగ్గే అవకాశం ఉందని ట్రస్ట్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కంపెనీ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. టాటా సన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో టాటా ట్రస్ట్స్‌కు 66శాతం వాటా ఉంది. ఈ మెజార్టీ యాజమాన్య హక్కులతో బోర్డు నామినీలను నియమించే హక్కు ట్రస్ట్స్‌కు ఉంది. దీంతో పాటు కంపెనీకి సంబంధించి కీలక వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా ఉంది. టాటా సన్స్ నుంచి తమకు వచ్చే డివిడెండ్లతో ట్రస్ట్స్ తమ దాతృత్వ కార్యక్రమాలకు నిధులు పొందుతోంది. అయితే, ఇప్పుడు ఆర్‌బీఐ ఆదేశాల మేరకు టాటా సన్స్ పబ్లిక్ ఇష్యూకు వెళ్తే.. కంపెనీపై ట్రస్ట్స్‌కు నియంత్రణ తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా 'మెజార్టీ ఆఫ్ మైనార్టీ' ఓటింగ్ నిబంధనతో కంపెనీలో తక్కువ వాటా కలిగిన ఎస్‌పీ (షాపూర్జీ పల్లోంజీ) సంస్థకు ప్రాముఖ్యత లభించనుంది. టాటా సన్స్‌లో 18.37% వాటాతో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా ఉంది. టాటా సన్స్‌ను లిస్టింగ్ చేయాలని ఎస్‌పీ సంస్థ ఐదేళ్లుగా డిమాండ్ చేస్తోంది. 2023 సెప్టెంబరులో టాటా సన్స్‌ను ఆర్‌బీఐ 'అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా' వర్గీకరించింది. నిబంధనల ప్రకారం మూడేళ్లలో అంటే 2025 సెప్టెంబర్ నాటికి ఈ కంపెనీ ఐపీఓ ప్రక్రియ పూర్తి చేసుకొని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కావాలి. అయితే, ఈ తప్పనిసరి లిస్టింగ్‌ను తప్పించుకునేందుకు టాటా సన్స్‌ను కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ జాబితా నుంచి తొలగించాలని ఆర్‌బీఐని కోరింది. ప్రస్తుతం ఈ వ్యవహారం కేంద్ర బ్యాంకు వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు, ఈ గ్రూప్ నుంచి టాటా క్యాపిటల్ సోమవారం (అక్టోబరు 13) స్టాక్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. ఒక శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది.

#### మళ్లీ చంద్రశేఖరన్ వైపే..

ఇదిలాఉండగా,.. టాటా సన్స్ ఛైర్మన్‌గా నటరాజన్ చంద్రశేఖరన్‌కు మూడోసారి అవకాశమిచ్చారు. కంపెనీ రిటైర్మెంట్ పాలసీని పక్కనబెట్టి మరీ.. ఆయన పదవీకాలాన్ని పొడిగించేందుకు ట్రస్ట్స్ నిర్ణయించింది. ఆయన రెండోసారి పదవీకాలం 2027తో ముగియనుండగా.. మరో ఐదేళ్ల పాటు అంటే 2032 వరకు ఆయన టాటా సన్స్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. అప్పటికి ఆయనకు 70ఏళ్లు రానున్నాయి. చంద్రశేఖర్ 2016 అక్టోబరులో టాటా సన్స్ బోర్డులో చేరారు. ఆ మరుసటి ఏడాది ఛైర్మన్‌గా తొలిసారి బాధ్యతలు చేపట్టారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక




## ముద్దు సీన్లు.. పేరెంట్స్ సలహాకు షాకయ్యా: సోనమ్ బజ్వా

బాబు బంగారం' (ఓ పాటలో), ఆటాడుకుందాం.. రా' సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పంజాబీ నటి సోనమ్ బజ్వా. తాను నటించిన హిందీ సినిమా ఏక్ దీవానే కీ దీవానియత్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో.. కెరీర్ ప్రారంభ రోజుల్ని గుర్తుచేసుకున్నారు. కిస్ సీన్ల విషయంలో తన సందేహాన్ని తల్లిదండ్రులకు చెబితే.. వారిచ్చిన సలహా విని షాకయ్యానని తెలిపారు. ముద్దు సన్నివేశాలున్న కారణంగా నేను పలు హిందీ సినిమాల్లో నటించేందుకు తిరస్కరించా. ఒకవేళ కిస్ సీన్లలో యాక్ట్ చేస్తే పంజాబీ ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారా? ఫ్యామిలీ ఆడియన్స్ ఏమనుకుంటారు? ఇదీ కేవలం నటనే అని నా కుటుంబం అర్థం చేసుకుంటుందా?.. బుర్ర నిండా ఇలాంటి ఆలోచనలే తిరిగేవి. నాకున్న సందేహాలన్నింటినీ ఓసారి తల్లిదండ్రులకు వివరించగా భారం తగ్గినట్టైంది. సినిమా కోసమే కదా అలా చేసేది. దాని వల్ల సమస్య ఏంటి?' అని వారు అనడంతో షాకయ్యా. ఇంతకాలం వీరితో ఈ టాపిక్ గురించి ఎందుకు చర్చించలేదా? అని అనిపించింది" అని సోనమ్ పేర్కొన్నారు. హర్షవర్ధన్ రాణే హీరోగా మిలప్ జవేరి తెరకెక్కించిన రొమాంటిక్ డ్రామా ఏక్ దీవానే కీ దీవానియత్' ఈ నెల 21న విడుదల కానుంది. 2016 తర్వాత సోనమ్ బజ్వా టాలీవుడ్‌లో మళ్లీ నటించలేదు. పంజాబీ, హిందీ సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు.

## ఆ సినిమా అంటే నాకు చాలా ఇష్టం

మాస్ మహారాజా రవితేజ 'మాస్ జాతర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో శ్రీలీల రవితేజ సరసన రొమాన్స్ చేయనుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి వచ్చిన అప్డేట్స్ అన్ని మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. ఇక భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 31న థియేటర్స్‌లోకి రానుంది. ఇక ఈ చిత్రంతో పాటు కిషోర్ తిరుమల దర్శకత్వంలోనూ ఓ భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. తాజాగా, ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవితేజ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఈగల్ సినిమా అంటే నాకు చాలా ఇష్టం అది నా ఫేవరెట్. అందులో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లోనే అత్యంత ఇష్టమైనది. కానీ జనాలకుఅది అర్థం కాలేదు. కథను సింపుల్‌గా చెప్పి ఉంటే అర్థం అయ్యేది కానీ స్క్రీన్ ప్లే కొంచెం క్లిష్టంగా ఉండటం వల్ల మెప్పించలేకపోయింది. "నా ఆటోగ్రాఫ్ మెమోరీస్' కూడా అలాగే జరిగింది. చాలా మంది హృదయాలను గెలుచుకుంది కానీ విజయం సాధించలేదు" అని చెప్పుకొచ్చాడు.



# ఒక్క ముద్దు సన్నివేశం లేదు

## తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ తెలుసు కదా రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర టిల్లు పాత్రను పోలి ఉందా అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా కృష్ణ అండ్ హిజ్ లేడీ. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. టిల్లు స్క్వేర్‌లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు రికవరీ అనేది ఎమోషనల్‌గా కావాలి. ఫైనాన్షియల్‌గా కాదు. రవితేజతో గతంలో ఒక సినిమా ఎ÷లాన్ చేశాం. కానీ, అది ఆగిపోయింది. ఒకవేళ మా ఇద్దరికీ సరిపోయే కథ ఉంటే కచ్చితంగా చేస్తాం అని సిద్ధూ అన్నారు.




## జై హనుమాన్‌పై రిషబ్ వ్యాఖ్యలు

### సినిమా ఆలస్యం కానుందన్న సంకేతాలు



కాంతార చాప్టర్ 1తో మళ్లీ ఒక్కసారి బాక్సాఫీస్‌ను శాసించిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి చిత్రం జై హనుమాన్ గురించి చేసిన కామెంట్స్‌తో హాట్ టాపిక్ అయ్యాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రిషబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో ఫ్యాన్స్ కాస్త నిరాశలో ఉన్నారు. కాంతార చాప్టర్ 1 ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి, తన తదుపరి ప్రాజెక్టుల గురించి స్పందించారు. చాప్టర్ 1 తర్వాత నేను చేస్తున్న సినిమా జై హనుమాన్. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా 2026 జనవరిలో సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత నా డైరెక్షన్‌లో మరో సినిమా ఉంటుంది, అది రెండేళ్లలో వస్తుంది అని ఆయన వెల్లడించారు. ఈ కామెంట్స్ విన్న తర్వాత అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదా 2026 జనవరి అంటే సినిమా రిలీజ్‌కు ఇంకెన్నాళ్లు అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో జై హనుమాన్ సినిమా నుంచి రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ అయినప్పుడు షూటింగ్ స్టార్ట్ అయిందన్న భావన అభిమానుల్లో ఏర్పడింది. కానీ ఆ ఫొటో కేవలం ఫోటోషూట్ మాత్రమేనని, అసలు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ ఇప్పుడే వచ్చింది. 2026 జనవరిలో సెట్స్ పైకి వెళ్తే, పోస్ట్‌ప్రొడక్షన్, గ్రాఫిక్స్, ప్రమోషన్స్ అన్నింటినీ కలుపుకుంటే ఈ సినిమా విడుదలకు కనీసం 2027 వరకు వేచి చూడాల్సి రావచ్చు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే గ్యాప్‌లో రిషబ్ శెట్టి దర్శకత్వం వహించే మరో ప్రాజెక్ట్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం, హనుమాన్ సినిమా సీక్వెల్ కావడంతో ఇప్పటికే భారీ బజ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన హనుమాన్ తర్వాత ప్రేక్షకులలో జై హనుమాన్‌పై భారీ అంచనాలున్నాయి.

## శ్రీవారిని దర్శించుకున్న కృతిశెట్టి

### వేరుగా వచ్చిన ఎన్టీఆర్ సతీమణి ప్రణతి

తిరుమల శ్రీవారిని సినీ నటి కృతి శెట్టి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను కృతి శెట్టికి అందజేశారు. అలాగే తిరుమల శ్రీవారిని జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ ప్రణతి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో నూతన వధూవరులు నార్నె నితిన్ దంపతులతో కలిసి స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

## హిందీలో రీమేక్ కానున్న సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే భూల్ భులయ్యా 2, రౌడీ రాథోర్, లక్ష్మీ వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఎ÷లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు. బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు. తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## ఆనంద్ దేవరకొండ..తక్షకుడు



బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం తక్షకుడు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు.. అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com